# ఎన్డీయే అంటే అభివృద్ధి, సుపరిపాలన

- దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకెళ్తాం
- రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను గెలిపించినా త్వరగా ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారు
- మద్దతుగా నిలిచిన ఎన్డీయే సభ్యులకు ధన్యవాదాలు
- ఎన్డీయేకు దేశప్రయోజనాలే ప్రధానం
- ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మోదీ ఉద్ఘాటన



న్యూఢిల్లీ: ఎన్డీఏ పాలనలో గత పదేళ్లుగా అభివృద్ధిలో దేశం కొత్త శిఖరాలను తాకిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఎన్డీఏ అంటే సుపరిపాలనకు మరోపేరుగా మారిందన్నారు. దేశ ప్రయోజనాలే పరమావధిగా ఎన్డీఏ పాలన సాగుతుందన్నారు. దేశ అభివృద్ధి చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించామన్నారు. వికసిత్ భారత్ స్వప్నాన్ని సాకారం చేసి తీరతామన్నారు. ఎన్డీఏ కూటమి అసలైన భారత్ స్ఫూర్తిని చాటుతుందన్నారు. కూటమిలో పరస్పర విశ్వాసమే ప్రధానమన్నారు. అన్ని అంశాల్లోనూ ఏకగ్రీవ నిర్ణయాలే లక్ష్యమన్నారు. రానున్న పదేళ్లు సుపరిపాలన, అభివృద్ధి, పౌరుల స్వేచ్ఛాయుత జీవితానికి పూచీ ఇస్తూ ఎన్డీఏ పాలన సాగుతుందన్నారు. ఎన్డీయే అంటే న్యూ , డెవలప్డ్, ఆస్పిరేషనల్ ఇండియా అని కొత్త అర్థం చెప్పారు. కూటమిలోని పార్టీలకు దేశ హితమే ముఖ్యం, అధికారం కాదు. దేశానికి మరింత సేవ చేయాలని ప్రజలు మమ్మల్ని ఆశీర్వదించారు.. దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకెళ్తామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడ్డాయని... కానీ చాలా త్వరగా ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాయన్నారు. ఆ రెండు రాష్ట్రాల్లోనూ ఇప్పుడు ప్రజలు ఎన్డీయేను ఆదరించారన్నారు. పాత పార్లమెంట్ భవనంలోని సెంట్రల్ హాలులో శుక్రవారం జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో... మోదీని తమ నాయకుడిగా ఎన్నుకుంటూ ఎంపీలందరూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ, టీడీపీ, జేడీయూ, శివసేన, లోక్ జనశక్తి (పాశ్వాన్), ఎన్సీపీ, జేడీఎస్, జనసేన, అప్నాదల్ సహా మిత్రపక్షాల ఎంపీలు, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, జేడీయూ అధ్యక్షుడు నితీశ్ కుమార్, శివసేన అధ్యక్షుడు ఏక్‌నాథ్ షిండే, తదితరులు హాజరయ్యారు. తనను ఎన్డీయే పక్ష నేతగా ఎన్నుకున్న అనంతరం మోదీ మాట్లాడారు. తమకు మద్దతుగా నిలిచిన ఎన్డీయే కూటమి పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్డీయే పక్ష నేతగా ఎన్నిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడానికి కార్యకర్తలు అహర్నిశలు శ్రమించారని గుర్తు చేసుకున్నారు. రాత్రింబవళ్లు కష్టపడిన కార్యకర్తలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నారు. తనపై విశ్వాసం ఉంచి నేతగా ఎన్నుకున్న ఎన్డీయే నేతలకు ఎంత కృతజ్ఞతలు చెప్పినా తక్కువే అన్నారు. ఎన్డీయే 22 రాష్ట్రాల్లో అధికారంలో ఉందని... ఎక్కువ జనాభా ఎక్కువగా ఉన్న 10 రాష్ట్రాల్లోని 7 చోట్ల మనమే అధికారంలో ఉన్నామన్నారు. తాము అన్ని మతాలు సమానం అనే సూత్రానికి కట్టుబడి ఉన్నామన్నారు. ఎన్డీయేలోని ప్రతి ఎంపీ తనకు సమానమే అన్నారు. మన కూటమి అసలైన భారత స్ఫూర్తిని చాటుతుందన్నారు. మన కూటమి భారత్ ఆత్మగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఎన్నికలకు ముందు పొత్తు పెట్టుకున్న కూటమి ఇంతగా ఎప్పుడూ విజయం సాధించలేదన్నారు. ప్రభుత్వం ఏర్పాటు కావాలంటే సంఖ్యాబలం అవసరమన్నారు. దేశాన్ని నడపాలంటే సర్వసమ్మతం అవసరమని అభిప్రాయపడ్డారు. దేశాన్ని మరింత ముందుకు తీసుకువెళతామని హామీ ఇస్తున్నానన్నారు.

### బురిడీ కొట్టిస్తారు.. జాగ్రత్త

కొంతమంది క్యాబినెట్ బెర్త్‌లు అంటూ బురిడీ కొట్టించే ప్రయత్నాలు చేస్తారని... అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని ప్రధాని నరేంద్ర మోదీ తమ ఎంపీలకు చెప్పారు. కేబినెట్ బెర్త్ అంటూ తన సంతకాలతో కూడిన జాబితా కూడా బయటకు రావొచ్చునని... ఇప్పుడు టెక్నాలజీ ఆ స్థాయిలో ఉందన్నారు. ఇలాంటి చర్యలతో ఎలాంటి ప్రయోజనం ఉండదని తెలుసుకోవాలని సూచించారు. అలాంటి వారి కుట్రలకు చిక్కవద్దని కోరారు. ఈ విషయంలో విపక్ష కూటమికి డబుల్ పీహెచ్‌డీ ఉందని ఎద్దేవా చేశారు. వదంతులను నమ్మరాదన్నారు. ప్రధాని మోదీ నవ్వుతూనే ఈ సూచన చేశారు. ఆయన వ్యాఖ్యలకు కూటమి సభ్యులంతా చిరునవ్వులు చిందించారు.

### చంద్రబాబుతో కలిసి చారిత్రాత్మక విజయం

ఏపీలో చంద్రబాబుతో కలిసి చారిత్రాత్మక విజయం సాధించామని మోదీ తెలిపారు. ఏపీ ప్రజలు తమకు పెద్ద ఎత్తున మద్దతు ఇచ్చారని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఏపీలో కూటమి సాధించింది మామూలు విజయం కాదని, మహా విజయం అని కొనియాడారు. ఆ భారీ విజయం ఏపీ ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టిందని అన్నారు.

### పవన్ అంటే తుఫాను

పక్కనే ఉన్న పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పవన్ ఇక్కడే ఉన్నాడు... పవన్ అంటే పవనం అనుకున్నారేమో... తుపాను అని అభివర్ణించారు. ప్రధాని వ్యాఖ్యలతో పవన్ చేతులు జోడించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం, ప్రధాని ప్రసంగం కొనసాగిస్తూ ఏపీ ప్రజలు తమకు ఇచ్చిన బహుమతిగా ఈ విజయాన్ని భావిస్తామని చెప్పారు. ఏపీ, అరుణాచల్ ప్రదేశ్, సిక్కింలో క్లీన్ స్వీప్ చేశామన్నారు.

మోదీ ప్రధానిగా ఉన్నంత వరకు..

## ఏ దేశానికీ భారత్ తలొగ్గదు: పవన్



న్యూఢిల్లీ: ప్రధాని మోదీ నాయకత్వానికి జనసేన పార్టీ మద్దతిస్తుందని ఆపార్టీ అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. విజనరీ నాయకుల బాటలో పయనించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన ఎన్డీయే ఎంపీల సమావేశంలో పవన్ మాట్లాడుతూ జనసేన తరఫున మోదీకి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు మోదీ స్ఫూర్తిగా నిలిచారన్నారు. మోదీ ప్రధానిగా ఉన్నంత వరకు ఏ దేశానికీ భారత్ తలొగ్గదు. ఆయన నేతృత్వంలో పనిచేయడాన్ని గర్వంగా భావిస్తున్నామన్నారు. మోదీ స్ఫూర్తితోనే తాము ఏపీలో ప్రభంజనం సృష్టించగలిగామని చెప్పారు. మోదీ దిశానిర్దేశంతో రాష్ట్రంలో 91శాతానికి పైగా సీట్లు గెలుచుకోగలిగామని అన్నారు. ఎన్డీయే పక్షనేతగా మోదీకి తాము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని, ఆయన వెనుక తామంతా ఉన్నామని పవన్‌కల్యాణ్ స్పష్టంచేశారు.

## సరైన సమయంలో సరైన నాయకుడు

- మోదీ విజన్ వల్లే అభివృద్ధిలో దూసుకెళుతున్న దేశం
- దేశానికి అద్భుత విజయాలందించారు
- ఆర్థికవ్యవస్థను పరుగులు తీయించారు
- ప్రధానిపై చంద్రబాబు ప్రశంసల జల్లు



న్యూఢిల్లీ:భారత్‌కు సరైన సమయంలో నరేంద్ర మోదీ రూపంలో సరైన నాయకుడు దొరికారని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రశంసించారు. న్యూఢిల్లీలోని పాత పార్లమెంట్ భవనంలోని సెంట్రల్ హాలులో శుక్రవారం జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ నరేంద్ర మోదీకి విజన్, ఉత్సాహం ఉన్నాయని, పరి పూర్ణ కార్యదక్షత కలిగిన నాయకుడన్నారు. తన విధానాలన్నింటినీ నిజమైన స్ఫూర్తితో అమలు చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం భారత్‌కు చాలా మంచి అవకాశం వచ్చిందని, ఇప్పుడు దానిని అందిపుచ్చుకోకపోతే తీవ్రంగా నష్టపోతామన్నారు. ఎన్డీయేను అధికారంలోకి తీసుకురావడానికి ప్రధాని మోదీ గత మూడునెలలుగా ఎన్నికల ప్రచారంలో తీరిక లేకుండా గడిపారని పేర్కొన్నారు. రేయింబ వళ్లు కష్టపడ్డారన్నారు. ఏపీలో మూడు బహిరంగ సభలు, ఒక భారీ ర్యాలీ నిర్వహించినట్టు గుర్తుచేశారు. హెూంమంత్రి అమిత్‌షా ఏపీలో నిర్వహించిన సభతోఎన్నికల స్వరూపమే మారిపోయిందని కొనియాడారు. భారీ మెజార్టీ రావడానికి అది కూడా కారణమంటూ ధన్యవాదాలు తెలిపారు. నడ్డా, రాజ్‌నాథ్ సింగ్ వంటి వారు కూడా ప్రచారానికి రావడంతో ప్రజల్లో విశ్వాసం పెరిగిందని పేర్కొన్నారు.మోదీ నేతృత్వంలోని భారతదేశం గత పదేళ్లలో ఎంతగానో అభివృద్ధి చెందిందని కొనియాడారు. దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు తీయించారన్నారు. ఆయన నేతృత్వంలోనే భారత దేశం ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుందని ప్రశంసించారు. ఇప్పుడు వికసిత్ భారత్, ప్లాన్ 2047పై ప్రణాళికలు రూపొందించారని, వీటిని చేరుకుంటామని తాము పూర్తివిశ్వాసం వ్యక్తం చేశారు. ప్రపంచంలో భారత్ అగ్రరాజ్యంగా, లేదంటే రెండో స్థానానికి ఎదుగుతుందని పేర్కొన్నారు. దేశానికి సరైన సమయంలో, సరైన వ్యక్తి దొరికారని ప్రశంసించారు. తాను ఎంతోమంది నేతలను చూశానుకానీ,మోదీ లాంటి శక్తిమంతమైన వ్యక్తిని ఎక్కడా చూడలేదన్నారు. మేకిన్ ఇండియా విజన్‌తో దేశాన్ని ముందుండి నడిపించారు. మోదీ విజన్ వల్లే దేశం అభివృద్ధిలో దూసుకుపోతోంది. అంతర్జాతీయ స్థాయిలోనూ భారత్ పేరు ప్రఖ్యాతులను మోదీ ఇనుమడింపజేశారని చంద్రబాబు ప్రశంసించారు. మోదీ విజన్, సమర్థత దేశానికి ఎంతో అవసరమని ఈసందర్భంగా చంద్రబాబు వ్యాఖ్యానించారు. దేశానికి మోదీ ఎన్నో అద్భుత విజయాలు అందించారని, దేశంలో యువశక్తి ఐటీ రంగంలో దూసుకు పోతోందని ప్రస్తావించారు. లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన నూతన ఎంపీలందరినీ ఆయన అభినందించారు.


### ఇక ఎప్పుడూ మోదీ వెంటే: నీతీష్

ఈ సందర్భంగా జేడీయూ నేత, బీహార్ ముఖ్యమంత్రి నీతీష్‌కుమార్ మాట్లాడుతూ మోదీ నాయకత్వంపై ప్రశంసలు కురిపించారు. ఇకపై తాము ఎల్లప్పుడూ మోదీ వెంటే ఉంటామని చెప్పారు. "గత పదేళ్లలో మోదీ దేశానికి ఎంతో సేవ చేశారు. బీహార్‌లో ఉన్న పెండింగ్ పనులను రానున్న ఐదేళ్లలో పూర్తి చేస్తారనే నమ్మకం ఉంది. మోదీతో కలిసి పనిచేసేందుకు మేమంతా ఇక్కడకు రావడం ఆనందంగా ఉంది" అని నీతీష్ అన్నారు.

అనంతరం ఇండియా కూటమిపై నీతీశ్ విమర్శలు గుప్పించారు. ఆ కూటమి దేశానికి చేసిందేమీలేదు.ఇటీవలి ఎన్నికల్లో కొన్ని స్థానాలు గెలిచారేమో.. కానీ వచ్చే ఎన్నికల్లో మొత్తంగా ఓడిపోతారు.దానిపై మాకు ఎలాంటి సందేహం లేదని నీతీష్ అనగానే మోదీ సహా అక్కడున్నవారంతా నవ్వులు చిందించారు.

## చంద్రబాబుకు అధికారం...

# పూలబాట కాదు



164 సీట్లు. కేంద్రంలో టీడీపీ ఎంపీలు కీలకం. ఇక చంద్రబాబు పాలన నల్లేరు మీద నడకే అనుకుంటే పొరబాటే. కేవలం అప్పులతో, కేంద్ర నిధులతోనే దివాలా తీసిన రాష్ట్ర ఖజానా నిండదు. చాలీచాలని నిధులతో జగన్‌రెడ్డి పెట్టిపోయిన రూ.2 లక్షల కోట్ల బకాయిలు చెల్లించి, అభివృద్ధి.. సంక్షేమం కోరే ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడం అసాధ్యం. ప్రజాకాంక్షలు నెరవేర్చడమేకాక 2047నాటికి రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపాలంటే ఉన్న ఆర్థిక వనరులతోపాటు మరో రూ.25 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించాలి. అందుకు పారిశ్రామికవేత్తలకు విశ్వాసం కల్పించడం పెద్ద పని. 2029లో తిరిగి అధికారంలోకి రాకపోతే మా పెట్టుబడులకు రక్షణ ఉంటుందా? అన్న పారిశ్రామికవేత్తల ప్రశ్నకు నమ్మకమైన సమాధానమిచ్చే విధంగా కూటమి నడుచుకోవాల్సిన బాధ్యత కూటమిపై ఉంటుంది. 2029లో తిరిగి అధికారంలోకి వచ్చే విధంగా నడుచుకోవాల్సి ఉంటుంది.

రెండో విషయం... రూ.13 లక్షల కోట్ల అప్పుకు వడ్డీ అసలు వాయిదాల చెల్లింపులో ఏడాదికి రూ.50 వేల కోట్లకు పైగా భరించాల్సి ఉంది. ఆరోగ్యశ్రీ బకాయిలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, కాంట్రాక్టర్ల బిల్లులు, ఉద్యోగుల బకాయిల్లాంటివి దాదాపు రూ.2 లక్షల కోట్లు భారం చంద్రబాబు నెత్తిన పెట్టి వెళ్లాడు జగన్.

మూడవది.. ప్రతి మంత్రి పదవికీ అర్హత కలిగినవారు ముగ్గురకు పైగా వున్నారు. వీరిలో ఒకరికి వస్తే మిగిలిన ఇద్దరు అర్థం చేసుకోవాలి. మంత్రి పదవి వచ్చినవారు మిగిలిన వారిని కలుపుకుని పోవాలి. అలాగే కూటమి పార్టీలు కూడా సీయం ఇబ్బందుల్ని పంచుకోవాల్సి వుంటుంది. స్థానిక సంస్థల పదవులు, నామినేటెడ్ పోస్టులు అన్నీ కలిపినా 2 లక్షలలోపే ఉంటాయి. కానీ పదవులు ఆశించే నాయకులు, కార్యకర్తలు 10 లక్షల మంది వరకూ వుంటారు. పదవులు వచ్చినవారు.. రానివారిని కలుపుకునిపోవాలి. రానివారు ప్రత్యామ్నాయంగా చట్టబద్ధమైన వ్యాపారాలు, వృత్తులలో సర్దుకోవాలి. అసంతృప్తులకు గురికాకుండా, అసంతృప్తిని వెదజల్లకుండా చిన్నచిన్న త్యాగాలు చేయాలి. Power Corrupts... Absolute power corrupts absolutely 'Machiavelli...

**గురజాల మాల్యాద్రి**
జాతీయ అధికార ప్రతినిధి

తిరుగులేని అధికారం అహంభావాన్ని, ఉదాసీనతను పెంచి నాయకుల్ని ప్రజలకు, కార్యకర్తలకు దూరం చేస్తుందని మాకియవెలీ సూక్తిని అర్థం చేసుకుని జాగ్రత్తపడాలి.

నాలుగవది... మేనిఫెస్టో హామీలన్నీ వెంటనే అమలు చేయలేదని జగన్ మాఫియా దుష్ప్రచారానికి దిగొచ్చు. వందల, వేల కోట్లు తినమరిగిన వైకాపా మాఫియా ప్రజల్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తుందనడంలో సందేహం లేదు. సాధ్యమైనంత మేరకు హామీలు అమలు చేస్తూనే, ప్రభుత్వానికి తగు సమయం ఇవ్వడం ఎలా న్యాయమో ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాలి. జగన్ నీలి మీడియా దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలి.

ఐదు... పోలవరం పూర్తిచేసి నదులు అనుసంధానించడం ద్వారా ప్రతి జిల్లాకు తాగు, సాగునీరు అందించడానికి నిధులు సమకూర్చుకోవాలి. ప్రజా రాజధాని అమరావతి నిర్మాణం చేపట్టి 26 జిల్లాలకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించాలి. గుంతలమయమైన రోడ్ల నిర్మాణం, పేదల గృహ నిర్మాణాలకు నిధులు సమకూర్చుకోవడం ముళ్ల బాటే. పార్టీ సహకారం, ప్రజా చైతన్యంతో నిధుల కొరత అగాధాన్ని ఈదాల్సి ఉంటుంది.


ఆరు... విధ్వంసమైన వ్యవస్థల్ని గాడిలో పెట్టడం విషమ పరీక్షే. ల్యాండ్, శాండ్, వైన్, మైన్, గంజా, డ్రగ్స్, ఎర్రచందనం మాఫియాలు దోచుకున్న ప్రజా సంపదను కక్కించి సంక్షేమ పథకాలకు వినియోగించాలి. నేరాలు, ఘోరాలు చేసిన వారికి శిక్షపడేలా చేయడం తేలికైన విషయం కాదు.

ఏడు... పేదలకు పదిచ్చి వంద కొట్టేసిన జగన్ పేదల మనిషిగా కపట ప్రచారాలు చేసుకుంటూ తనకు దూరమైన పేదల్లోకి తిరిగి దూరే ప్రయత్నం గట్టిగా చేస్తాడు. సందివ్వకుండా పేదల్ని నిరంతరం చైతన్యం చేయడం కూటమి బాధ్యతగా వుండాలి.

కష్టపడుతూ, చిన్నచిన్న త్యాగాలు చేస్తూ, ప్రజల్ని చైతన్యపరుస్తూ, కూటమి 2029లో అధికారంలోకి రావడమే లక్ష్యంగా కృషి చేయాల్సి వుంటుంది. 2004లో చంద్రబాబు అధికారం కొనసాగి వుంటే ఉమ్మడి రాష్ట్రంలోని 23 జిల్లా కేంద్రాలు 23 సైబరాబాద్‌లయ్యేవి.

2019లో చంద్రబాబు అధికారం కొనసాగివుంటే పోలవరం నదుల అనుసంధానం పూర్తయి ప్రతి ఎకరాకు నీరు పారి ఉండేది. ప్రజా రాజధాని పూర్తయి 26 జిల్లాల యువతకు అమరావతిలో ఉద్యోగాలు, ఉపాధి లభించి వుండేది. సంపద సృష్టి జరిగి ప్రభుత్వ ఆదాయం పెరిగి 175 నియోజకవర్గాల అభివృద్ధికి నిధుల లభ్యత పెరిగి వుండేది. 2029లో తిరిగి కూటమి అధికారానికి వస్తేనే రాష్ట్రం 2047 నాటికి దేశంలో అగ్రస్థానానికి చేరుతుంది. ఈ లక్ష్యం దిశగా కూటమి పార్టీల్ని, ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసే కృషి నిరంతరం జరుగుతూ వుండాలి. చంద్రబాబుకు అధికారం పూలబాట కాదనే వాస్తవాన్ని ప్రతి పౌరునికి అర్థమయ్యే విధంగా చెప్పడం ప్రతినాయకుడు, కార్యకర్త తమ కర్తవ్యంగా భావించి పనిచేయాలి.

# ఎన్డీయే పక్షనేతగా మోదీ ఏకగ్రీవం



- ప్రతిపాదించిన రాజ్‌నాథ్ సింగ్
- బలపరిచిన చంద్రబాబు, ఇతర నేతలు
- రాష్ట్రపతిని కలిసి సమావేశ తీర్మానం అందజేత
- 9న ప్రమాణ స్వీకారం చేస్తామని తెలిపిన నేతలు
- ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించిన రాష్ట్రపతి

న్యూఢిల్లీ: లోక్‌సభలో ఎన్డీయే పక్ష నేతగా ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికయ్యారు. ఢిల్లీలో శుక్రవారం జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఎంపీలందరూ ఏకగ్రీవంగా మోదీని తమ నేతగా ఎన్నుకున్నారు. ఈ భేటీలో తెదేపా అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ సమావేశానికి 240 మంది బీజేపీ ఎంపీలతోపాటు టీడీపీ, జేడీయూ, శివసేన, లోక్‌జన్‌శక్తి (రాంవిలాస్), ఎన్‌సీపీ, జేడీఎస్, జనసేన, అప్నాదళ్ సహా ఇతర మిత్రపక్షాల ఎంపీలు, ఎన్డీయే పార్టీల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు హాజరయ్యారు. పాత పార్లమెంటు భవనంలోని సెంట్రల్‌హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో ఎన్డీయే పక్ష నేతగా నరేంద్ర మోదీ పేరును రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదించగా టీడీపీ అధినేత చంద్రబాబు, అమిత్ షా, నితిన్ గడ్కరీ, పవన్ కల్యాణ్, ఏక్‌నాథ్ షిండే, కుమారస్వామి, అజిత్ పవార్ తదితర ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలు కూడా బలపరిచారు. తద్వారా లోక్‌సభలో ఎన్డీయే సభాపక్ష నేతగా మోదీ ఎన్నిక ఏకగ్రీవమైంది. అనంతరం ఎన్డీయే నేతలందరూ నరేంద్రమోదీకి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎన్డీయే నేతలు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసి తమ నేతగా మోదీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతిచ్చే ఎంపీల జాబితాను అందజేశారు. కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరారు. దీనిపై స్పందించిన రాష్ట్రపతి.. ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటూ మోదీని ఆహ్వానించారు.



రాష్ట్రపతిని కలిసిన అనంతరం మోదీ మీడియాతో మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ ఉత్సవాల తర్వాత జరిగిన మొదటి ఎన్నికలు ఇవి.. ప్రజల ఆకాంక్షల మేరకు మరింత ఉత్సాహంగా పని చేస్తామన్నారు. శుక్రవారం ఉదయమే ఎన్డీయే నేతలంతా కలిసి చర్చించాం. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని రాష్ట్రపతిని కోరాం. ఆదివారం ప్రమాణ స్వీకారం చేస్తామని రాష్ట్రపతికి తెలియజేశామని మోదీ తెలిపారు.



# మూడక్షరాల గుండెధైర్యం!

ఎవరో ఒకరు ఎపుడోకపుడు నడవరా ముందుకు అటో ఇటో ఎటోవైపు - అన్నాడు అంకురం చిత్రం కోసం సిరివెన్నెల సీతారామశాస్త్రి. బహుశ, యువనేత లోకేష్‌లాంటి రియల్ క్యారెక్టరేదో సీతారామశాస్త్రి కంట పడుండాలి. గద్దెనెక్కిన జగన్ సాగిస్తోన్న విధ్వంస పాలనను రాష్ట్రమంతా మౌనంగా భరిస్తున్న సమయంలో - ఉద్యమ బాటపట్టి తొలి అడుగేసింది నారా లోకేష్. జగన్ అరాచకాన్ని పంటి బిగువున భరిస్తున్న రాష్ట్ర ప్రజల్లో చైతన్య ఊపిర్లూదింది ఆ అడుగుతోనే. యువనేత వేసిన తొలి అడుగు -అప్పటికి విలయ తాండవం చేస్తున్న జగన్ సర్కారు విధ్వంసానికి దారి తీస్తుందని ఎవ్వరూ ఊహించలేదు. రాష్ట్ర ప్రజానీకాన్ని చైతన్యపర్చే వరకూ తన అడుగులు ఆగకూడదని మాత్రమే లోకేష్ సంకల్పించాడు. ఆ సంకల్పం ముందు - జగన్ కుయుక్తులు, కుటిల యత్నాలేవీ ఫలించలేదు. అలా - అప్పుడు రాష్ట్ర ప్రజలను గెలిచాడు లోకేష్. ఇప్పుడు - రాష్ట్ర ప్రజలను గెలిపించాడు లోకేష్. రాష్ట్ర ప్రజానీకానికి యువనేత లోకేష్ అంటే - మూడక్షరాల గుండెధైర్యం!!

- వైసీపీ పీడితులకు అండగా నిలిచిన లోకేష్
- యువత, మహిళలకు అతనో చైతన్య ఊపిరి..
- 'మిషన్ రాయలసీమ'తో బలమైన అడుగులు
- లోకేష్ ప్రతి అడుగూ.. కూటమికి బలమైంది

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో ఐదేళ్ల జగన్మోహన్‌రెడ్డి అరాచకపాలనలో నరకం చూసిన ప్రజలకు నేనున్నానని భరోసా కల్పించడంలో యువనేత నారా లోకేష్ పూర్తి విజయం సాధించారు. 226 రోజులపాటు జరిగిన సుదీర్ఘ పాదయాత్రలో క్షేత్రస్థాయిలో వివిధవర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను యువనేత ఆకళింపు చేసుకున్నారు. పాదయాత్ర సమయంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను తమ డైరీలో నిక్షిప్తం చేసుకోవడమేగాక ఆయావర్గాల మనోభీష్టాన్ని అధిష్టానానికి తెలియజేసి, ఎన్నికల సమయంలో విడుదల చేసిన మ్యానిఫెస్టో రూపకల్పనలో కీలకపాత్ర వహించారు. ముఖ్యంగా జగన్ పాలనలో తీవ్ర నిరాశ, నిస్పృహల్లో మునిగిపోయిన యువతకు భరోసా కల్పించడంలో లోకేష్ సఫలీకృతులయ్యారు. యువగళం చిత్తూరు జిల్లాలో కొనసాగుతున్న సమయంలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా 107 నియోజకవర్గాల పరిధిలోని 3 పట్టభద్రుల స్థానాలకు జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం ఘనవిజయం సాధించడమే ఇందుకు నిదర్శనం. పాదయాత్ర సమయంలో వివిధ ప్రాంతాల్లో యువతతో నిర్వహించిన ముఖాముఖి సమావేశాల్లో వారి మనోభావాలను తెలుసుకున్నారు. చిత్తూరులో 26వరోజు యువతతో నిర్వహించిన 'హలో లోకేష్' కార్యక్రమంలో రాష్ట్రంలో పెద్దఎత్తున పరిశ్రమల ఏర్పాటు, యువతీ యువకులకు ఉద్యోగావకాశాల కల్పన, రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధిపథంలో గాడిన పెట్టడానికి తమవద్ద ఉన్న ప్రణాళికలను లోకేష్ స్పష్టంగా తెలియజేశారు. ప్రతిఏటా జాబ్ క్యాలండర్ ద్వారా ఐదేళ్లలో ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వోద్యోగాల భర్తీ, ప్రభుత్వ, ప్రైవేటు, ఉపాధి రంగాల్లో ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాల కల్పన, నిరుద్యోగులకు రూ.3వేల భృతివంటి అంశాలను మ్యానిఫెస్టోలో పొందుపర్చడంలో కీలకపాత్ర పోషించారు. దీంతోపాటు జగన్మోహన్ రెడ్డి పాలనలో మహమ్మారిలా తయారైన గంజాయిపై తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఉక్కు పాదం మోపుతామంటూ తెలుగు దేశం పార్టీ విధానాన్ని సాక్షాత్కరించారు.

**తోబుట్టువులా మహిళలకు యువనేత అండ**

జగన్ పాలనలో భయకంపితులైన మహిళలకు తోబుట్టువు మాదిరిగా మనోనిబ్బరాన్ని కలిగించడంలో యువనేత లోకేష్ సఫలీకృతులయ్యారు. యువగళం పాదయాత్రలో లోకేష్‌ను కలిసి బాధలు చెప్పుకున్న వారిలో అత్యధిక శాతం మహిళలే. పాదయాత్రకు ముందు అరాచకశక్తుల చేతిలో బలైన రమ్య, అనూష ఘటనల్లో జగన్ సర్కారు సృష్టించిన అడ్డంకులను అధిగమించి ఆయా కుటుంబాల తరఫున న్యాయం కోసం పోరాడారు. రమ్య హత్య తర్వాత ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేపట్టినందుకు తొలిసారి లోకేష్ పోలీస్ స్టేషన్ గడప తొక్కారు. యువనేత పాదయాత్రలో తెలుసుకున్న సమస్యలను లోకేష్ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాకే అధినేత చంద్రబాబునాయుడు మహాశక్తి పథకాన్ని మహానాడు సాక్షిగా ప్రకటించారు. తర్వాత దీన్ని పార్టీ మ్యానిఫెస్టోలోనూ పొందుపర్చారు. జగన్ పాలనలో బతుకుభారంగా మారి తమ బిడ్డలను చదివించుకోలేక పోతున్నామన్న మహిళల వేదనను చూసి వారి కన్నీళ్లు తుడవాలని నిర్ణయించారు. మహాశక్తిలో భాగంగా తల్లికి వందనం కింద ప్రతిబిడ్డకు 15వేల సాయం, ఆడబిడ్డ నిధి కింద మహిళలకు ప్రతినెలా 1500 రూపాయల ఆర్థిక సాయం,ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ప్రతిఏటా ఉచితంగా 3 గ్యాస్ సిలెండర్ల హామీలను ప్రకటించడంలో లోకేష్ కీలకపాత్ర వహించారు. యువగళం పాదయాత్ర 145వరోజు నెల్లూరులో నిర్వహించిన 'మహాశక్తి'తో మహిళల భరోసా, భద్రత కోసం అధికారంలోకి వచ్చాక ఏం చేయబోతున్నామో తెలియజేశారు. జగన్ పాలనలో తన తల్లికి జరిగిన అవమానం మరో చెల్లికి జరగనీయబోనని, అధికారంలోకి వచ్చాక మహిళలను అవమానించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని, నిర్భయ చట్టాన్ని అమలుచేయడం ద్వారా పటిష్టమైన రక్షణ కల్పిస్తామని చెప్పారు. మహిళలను గౌరవించాలన్న ఆలోచన మనసులో రావాలి. ఇందుకోసం కెజి నుంచి పీజి వరకు మహిళలను గౌరవించాలనే ప్రత్యేక పాఠ్యాంశాలు తెచ్చి, సామాజిక చైతన్యంతెచ్చే బాధ్యత తీసుకుంటా మని అభయమిచ్చారు. మహిళలవంక కన్నెత్తి చూడాలంటే భయపడేలా చేస్తామంటూ నెల్లూరు సమావేశంలో సింహగర్జన చేశారు. మహిళల భద్రతకు లోకేష్ ఇచ్చిన భరోసా ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓట్లవర్షం కురిపించింది.

## 'మిషన్ రాయలసీమ'తో సీమ ప్రజలకు స్వాంతన

ముఖ్యంగా రాయలసీమలో గతంలో ఏ నాయకుడు వేయని విధంగా 124 రోజులపాటు 1584 కి.మీ.ల పాదయాత్ర చేసి రికార్డు సృష్టించారు. ముఖ్యంగా రాయలసీమలో పాదయాత్ర నిర్వహించే సమయంలో ఎదురైన పలు సంఘటనలు యువనేత లోకేష్‌ను కదిలించాయి. యువగళం పాదయాత్ర 81వరోజు మంత్రాలయం నియోజకవర్గంలో కొనసాగుతున్న సమయంలో కోసిగికి చెందిన 20మంది వలసకూలీలు గుంటూరువెళ్లి మిర్చి కోత పనులు చేసుకొని ఒక వాహనంలో తిరిగివస్తుండగా, యువనేత వారిని పలకరించారు. స్థానికంగా పనుల్లేక 3 నెలలు పనులకోసం గుంటూరు వెళ్లి వస్తున్నామని వారు చెప్పడంతో లోకేష్ భావోద్వేగానికి గురయ్యారు. ప్రత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో పాదయాత్ర చేస్తున్న సమయంలో గుక్కెడు నీటికోసం ప్లాస్టిక్ బిందెలతో కి.మీ.ల దూరం వెళ్లడంచూసి చలించిపోయారు. ఇవన్నీ చూశాకే రాయలసీమ ప్రజల ఆశలు, ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ కడపలో 119వరోజు (7-6-2023)న నిర్వహించిన సదస్సులో మిషన్ రాయలసీమను ప్రకటించారు. ఈ సదస్సులో టీడీపీ అధికారంలోకి వచ్చాక మిషన్ రాయలసీమ పేరుతో రాబోయే ఐదేళ్లలో ఏంచేస్తామనే విషయమై లోకేష్ విస్పష్టమైన విధానాన్ని ప్రకటించారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయడం ద్వారా ప్రతి ఎకరానికి సాగునీరు, 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్, హార్టీకల్చర్ హబ్‌గా రాయలసీమను మార్చడం, హార్టీకల్చర్ పంటల కోసం రీసెర్చ్ సెంటర్ల ఏర్పాటు, వాటర్ గ్రిడ్ ద్వారా 24/7 ఇంటింటికీ సురక్షితమైన మంచినీరు, ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్ పరిశ్రమల ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన, రాయలసీమలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు, శ్రీశైలం కేంద్రంగా రాయలసీమను పర్యాటక కేంద్రంగా అభివద్ధి చేయడం... టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, టైగర్ ఎకో టూరిజం ఏర్పాటు ద్వారా గిరిజనులు, చెంచులకు ఉపాధి అవకాశాలు కల్పించడం మిషన్ రాయలసీమలో అంతర్భాగాలుగా ఉన్నాయి. జగన్మోహన్ రెడ్డి తమకు తిరుగులేదని అనుకున్న రాయలసీమలో తెలుగుదేశం సాధించిన ఘన విజయాల వెనుక లోకేష్ ముద్ర స్పష్టంగా కన్పించింది.

# మతాలకు అతీతంగా...

# ముస్లింలు ఎక్కువగా ఉన్న స్థానాల్లో కూటమి ఘనవిజయం

- కూటమిలో బీజేపీ భాగస్వామ్యం పట్ల అపోహలు పటాపంచలు
- ముస్లింలు అధికంగా ఉన్న విజయవాడ వెస్ట్‌లో బీజేపీ ఘనవిజయం
- కర్నూలు, గుంటూరు ఈస్ట్, కడప, నంద్యాలలో టీడీపీ భారీ విజయం
- ముస్లింలు ఎక్కువగా ఉన్న 40 స్థానాల్లో 38 కూటమి కైవసం
- పులివెందుల, పుంగనూరులో మాత్రమే గెలిచిన వైసీపీ



అమరావతి (చైతన్య రథం): సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ -బీజేపీ -జనసేన కూటమి ప్రభంజనం ఒక చారిత్రక విజయం. ఎన్నికల్లో ప్రజల తీర్పుద్వారా వెల్లడయ్యే ఒక మహాసందేశం అనే పర్వంలో పలు ఇతర సందేశాలు అంతర్లీనంగా ఇమిడి ఉంటాయి. అలాంటి ఒక ఉపపర్వమే... ముస్లిం మైనారిటీలు తమ ఓట్ల ద్వారా వెల్లడించిన మనోభిప్రాయం.

తెలుగుదేశం, జనసేనలు బీజేపీతో పొత్తుపెట్టుకునే ప్రతిపాదన జరిగినప్పుడు భిన్నాభిప్రాయాలు కొంత మేరకు వ్యక్తమయ్యాయి. అలాజరిగితే ముస్లిం మైనారిటీల ఓట్లు కొంతమేరకు కూటమి కోల్పోవచ్చు అనే సందేహాలు వెల్లడయ్యాయి. దీనిపై కొనసాగిన చర్చ రాజకీయవర్గాల్లో, ముఖ్యంగా టీడీపీ అభిమానుల్లో కొం త ఆందోళన కలిగించింది. కానీ... ముస్లింల సంక్షే మం, అభివృద్ధి, భద్రతపట్ల తెలుగుదేశం నిబద్ధత ను ఆవర్గం గుర్తించి కూటమికి ఈ ఎన్నికల్లో అండగా నిలబడతారన్న ధీమాతో టీడీపీ నాయకత్వం కూటమి ఏర్పాటువైపు ముందడుగు వేసింది. జూన్ 4న జరిగిన ఓట్ల లెక్కింపులో కూటమి ప్రభంజనం కొనసాగి 164 శాసనసభా స్థానాల్లో విజయభేరి మోగించి చరిత్ర సృష్టించింది.

కులం, మతం, ప్రాంతాలకు అతీతంగా రాష్ట్ర ప్రజ లు ఒకేతీరున నిశబ్ధంగా మార్పు కోరుతూ జగన్‌రెడ్డి పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించినట్లు ఈ ఎన్నికల తీర్పు స్పష్టంచేసింది. ఓట్ల లెక్కింపు అనంతరం ముస్లిం మైనారిటీలు అధిక సంఖ్యలో ఉండి ఎన్నికల ఫలితాల ను ప్రభావితం చేసే శాసనసభ స్థానాల్లో కూటమి విజ యాలు ఈవిషయాన్ని రూఢీ చేశాయి. ఏకులంవారైనా, ఏమతంవారైనా వారి ఆశలు, ఆకాంక్షలు ఒకేతీరున ఉంటాయని... గత ఐదేళ్ల పాలనలో వారికి ఎదురైన అనుభవాల నేపథ్యంలో వారి మెరుగైన జీవితం కోసం, వారి పిల్లల ఉన్నత భవిష్యత్తు కోసం ఒకేతీరున స్పంది స్తారని, ఆమేరకు ఒకేరీతిన ఓట్లువేసి, వారికి నమ్మకం ఉన్న పార్టీని, నాయకుడిని గెలిపించు కుంటారని ఈ ఎన్నికలు నిరూపించాయి.

విజయవాడవెస్ట్ నియోజకవర్గంలో 33వేలకు పైగా ముస్లిం జనాభావుంటే ఆ సీటును బీజేపీకి కేటాయిం చడంపై పలు అనుమానాలు, ఆక్షేపణలు వ్యక్తమయ్యా యి. 47వేలకు పైగా మెజారిటీతో బీజేపీ అభ్యర్థి వైఎస్ చౌదరి ఈ స్థానాన్ని కైవసం చేసుకోవడం విశేషం.

అదేవిధంగా ముస్లింలు అధిక సంఖ్యలోవున్న కర్నూ లు, గుంటూరు ఈస్ట్, నంద్యాల, రాయచోటి, కడప వంటి స్థానాల్లో గెలవడం... ఈ ఎన్నికల్లో ప్రజలు మతాలకు అతీతంగా తీర్పునిచ్చారన్న విషయాన్ని స్పష్టం చేశాయి.

### ముస్లింలు ఎక్కువగా ఉన్న సీట్లలో కూటమి స్వీప్

రాష్ట్ర శాసనసభలోని 175స్థానాల్లో జనాభాపరంగా ఒకటి, రెండు స్థానాల్లో ఉండి ఎన్నికల ఫలితాలను ముస్లింలు ప్రభావితం చేయగలిగిన 40 స్థానాలున్నా యి. వాటిలో 38 స్థానాలను కూటమి గెలుచుకుని చరిత్ర సృష్టించింది. అధికార వైసీపీ కేవలం రెండు స్థానాలను మాత్రమే గెలుచుకోగలిగింది. బీజేపీని బూచి గా చూపి ముస్లిం మైనారిటీలను కూటమికి వ్యతి రేకంగా ఓటు వేసేలా చూడటానికి జగన్‌రెడ్డి శిబిరం అన్ని ప్రయత్నాలూ చేసి విఫలమైంది. ఇతర వర్గాల ప్రజల మాదిరిగానే మైనారిటీలు కూడా గత ఐదేళ్ల జగనాంధకారానికి చరమగీతం పలికి టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో తమ భవి ష్యత్తును పునర్నిర్మించుకోవాలని బలంగా కోరుకోవడం తో జగన్‌రెడ్డి కుట్రలు భగ్నమయ్యాయి.

ఈ ఎన్నికల్లో అధికార వైసీపీ ఏడు శాసనసభ స్థానాల్లో ముస్లిం అభ్యర్థులను బరిలోకిదించి ఒక్కచోట కూడా విజయం సాధించలేకపోయింది. టీడీపీ పోటీ లోకి దించిన ముగ్గురు ముస్లిం అభ్యర్థులను గెలిపించు కోగలిగింది. విశేషమేమంటే వైసీపీ ముస్లిం అభ్యర్థులు పోటీ చేసిన ఏడుస్థానాల్లో ఆరుచోట్ల జనాభాపరంగా ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్నారు. ఈ ఏడు స్థానాల్లో కూటమి ఐదుచోట్ల ముస్లిమేతరు లను బరిలోకి దించి మొత్తం ఏడుస్థానాలను గెలుచు కోగలిగింది. ఈ ఏడుస్థానాలు... విజయవాడ వెస్ట్, గుంటూరు ఈస్ట్, నెల్లూరు సిటీ, కడప, కర్నూలు, కదిరి, మదనపల్లె వీటిలో గుంటూరు ఈస్ట్, మదన పల్లెలో టీడీపీ తరుపున ముస్లిం అభ్యర్థులు పోటీ చేశారు. నంద్యాల లో టీడీపీ అభ్యర్థిగా మహ్మద్ ఫరూక్ పోటీచేసి వైసీపీ అభ్యర్థి శిల్పారవి చంద్రారెడ్డిపై గెలుపొందారు.

ఇవికాక పలమనేరు, పొణ్యాం, నందికొట్కూరు, పొన్నూరు, గురజాల, నరసరావుపేట, విజయవాడ సెంట్రల్, చిలకలూరిపేట, బాపట్ల, తాడికొండ, విశాఖపట్నం నార్త్, పెనమలూరు, విజయవాడ ఈస్ట్, మంగళగిరి, సత్తెనపల్లి, గిద్దలూరు, కోడుమూరు, ఎమ్మిగనూరు, తాడిపత్రి, కొవ్వూరు, ఆత్మకూరు, నెల్లూరు సిటీ, తంబళ్లపల్లె శాసనసభ స్థానాల్లో కూడా కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. ముస్లింలు దాదాపు 25వేల చొప్పున ఉండి ఫలితాలను ప్రభా వితం చేయగలిగిన స్థితిలో ఉండటం గమనార్హం.

### జగన్‌రెడ్డికి షాక్

అధికార వైసీపీ కేవలం పులివెందుల, పుంగనూరు స్థానాల్లో మాత్రమే గెలవగలిగింది. నిత్యం నా మైనారిటీలు అని మాట్లాడుతూ... వారికి ఇంతకుముందు ఎవరూ చేయని విధంగా మేలు చేశానని చెప్పుకునే ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి ఈ ఫలితాలు భారీ షాక్‌నిచ్చాయి. కేవలం బటన్ నొక్కితే చాలు... ప్రజలు ఓట్లేస్తారు అనే విశ్వాసంతో గత ఐదేళ్లుగా మైనారిటీల ఆశలు, ఆకాంక్షలను సమగ్రంగా అర్థం చేసుకోకుండా పాలన సాగించినందుకు ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తగిన మూల్యం చెల్లించు కోవాల్సి వచ్చిందని రాజకీయ పరిశీలకుల అభిప్రాయం.

ఎన్నికల ఫలితాలపై స్పందిస్తూ... ఎంతో మేలు చేసినా అవ్వతాతల ప్రేమ ఏమైందో అంటూ నిర్వేదంతో మాట్లాడిన ముఖ్యమంత్రి... తన ఓటమికి ప్రజలను తప్పుపట్టడాన్ని పరి శీలకులు ఆక్షేపిస్తున్నారు. తన సమగ్ర ఓటమికి కారణాలను సమీక్షించుకోకుండా జగన్‌రెడ్డి ప్రజలపై నెపంవేసి... తనతీరు మారదన్న సందేశాన్ని ఇచ్చారని వారి అభిప్రాయం.

*ముస్లింలు 30వేలకు పైగా ఉండి జనాభాపరంగా ఒకటో స్థానంలో ఉండి టీడీపీ గెలుచుకున్న శాసనసభ స్థానాలు:*

| క్రమ సంఖ్య | నియోజకవర్గం పేరు | ముస్లిం జనాభా | మొత్తం జనాభాలో శాతం |
|---|---|---|---|
| 1 | కర్నూలు | 54,610 | (21.10%) |
| 2 | గుంటూరు ఈస్ట్ | 51,190 | 14.51 |
| 3 | నంద్యాల | 48,978 | 26.46 |
| 4 | రాయచోటి | 47,634 | 24.36 |
| 5 | కడప | 45,440 | 33.94 |
| 6 | అనంతపురం అర్బన్ | 42,928 | 16.80 |
| 7 | ఆదోని | 42,560 | 21.26 |
| 8 | కదిరి | 38,858 | 20.14 |
| 9 | హిందూపూరం | 37,366 | 20.58 |
| 10 | ప్రొద్దుటూరు | 35,330 | 20.39 |
| 11 | ఆళ్లగడ్డ | 35,205 | 18.64 |
| 12 | పీలేరు | 34,735 | 17.74 |
| 13 | గుంతకల్లు | 34,355 | 16.19 |
| 13 | విజయవాడ వెస్ట్ | 33,170 | 14.24 |
| 14 | గుంటూరు వెస్ట్ | 32,624 | 12.30 |
| 15 | శ్రీశైలం | 32,533 | 22.87 |
| 16 | పుంగనూరు | 31,309 | 15.98 |

# మద్యం డొంక కదులుతోంది!

- వాసుదేవరెడ్డి నివాసంలో సీఐడీ సోదాలు
- మద్యం దోపిడీలో జగన్‌రెడ్డికి అడ్డగోలు సహకారం
- ఆయన కనుసన్నల్లోనే సరఫరా, అమ్మకాలు
- బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా సర్వం తానై నడిపించిన వైనం

అమరావతి: రాష్ట్రంలో మద్యం వ్యాపారంలో కీలకం గా వ్యవహరించిన ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి నివాసంలో సీఐడీ అధికారులు సోదాలు చేశారు. కంచికచర్ల మండలం మిగులూరు వాసి గద్దె శివరామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీఐడీ అధికారులు ఈ సోదాలు నిర్వహించారు. హైదరాబాద్ నానక్‌రామ్ గూడలోని వాసుదేవరెడ్డి నివా సంలో శుక్రవారం ఉదయం నుంచి సోదాలు ప్రారం భించిన సీఐడీ అధికారులు కీలక పత్రాలను పరిశీలించారు.

నూతన మద్యం పాలసీ పేరిట అడ్డగోలు దోపిడీ పర్వానికి సహకరించారన్న ఆరోపణల నేపథ్యంలో సీఐడీ అధికారులు సోదాలు చేపట్టారు. రాష్ట్రంలోని మద్యం డిస్టిలరీలు అనధికార మార్గాల్లో వైసీపీ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడంలో వాసుదేవరెడ్డిదే కీలక పాత్ర అని, తద్వారా మద్యం రూపంలో వైసీపీకి భారీ ఆదాయం లభించిందన్న ఆరోపణలు ఉన్నాయి. జగన్ పాలనా కాలంలో మద్యం వ్యాపారం తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఎక్కడా లేనివిధంగా ఇక్కడ నాసి రకం మద్యం అధిక ధరలకు విక్రయించారు. ప్రధాన బ్రాండ్ల మద్యం కంటికి కనిపించకుండా చేశారు. దీనికి తోడు రూ.60ఉన్న మద్యంక్వార్టర్ బాటిల్‌ను రూ.200 లకు అమ్మారు. దీనివెనుక పెద్దఎత్తున మాఫియా ఉందనే ఆరోపణలు తీవ్రస్థాయిలోనే వచ్చాయి.

తనకు అత్యంత నమ్మకస్తుడైన.. ఐఆర్‌టీఎస్ (ఇండి యన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్)లో పనిచేస్తున్న వాసు దేవరెడ్డిని జగన్ ఏరికోరి డిప్యుటేషన్‌పై తీసుకొచ్చి రాష్ట్రంలో మద్యం వ్యాపారాన్ని టోకుగా నిర్వహించే ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ ఎండీగా నియమించుకున్నారు. ఈ పదవి చేపట్టింది మొదలు వాసుదేవరెడ్డి.. జగన్ విచ్చలవిడి దోపిడీకి అన్ని విధాలుగా సహకరించారు. సరైన లెక్కలు లేకుండానే మద్యం అమ్మకాలు సాగిం చారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఎక్కడా డిజిటల్ చెల్లింపులు లేకుండా మొత్తం నగదు చెల్లింపులతోనే నడిపించారు. తద్వారా మద్యం దుకాణాలకు ఎంత సరుకు,ఎక్కడి నుంచి వస్తోంది, ఎంత మేర అమ్మకాలు జరిగాయనే వాస్తవ లెక్కలు బయటపడకుండా జాగ్రత్త పడ్డారు.

టీడీపీ అధినేత చంద్రబాబు కూడా పలు మార్లు లిక్కర్ కుంభకోణంపై విమర్శలు చేశారు. తాము అధి కారంలోకి వస్తే.. లిక్కర్ మాఫియా అంతు చూస్తామని కూడా హెచ్చరించారు. ఈ క్రమంలోనే తొలి అడుగు ఇప్పుడు పడినట్టు కనిపిస్తోంది. జగన్‌రెడ్డికి వాసుదేవ రెడ్డి కరడుగట్టిన మద్దతుదారుగా వ్యవహరించారని టీడీపీ నాయకులు విమర్శించిన విషయం తెలిసిందే. మద్యం రాబడి..పాలసీ సహా అన్ని విషయాలు ఈయన కనుసన్నల్లోనే జరిగాయి. అందుకే.. ముందుగా ఈయ నను విచారిస్తున్నట్టు సమాచారం. అనంతరం.. అసలు వ్యక్తులను బయటకు తీసుకువచ్చే ప్రయత్నం చేయనున్నట్టు తెలుస్తోంది.



### వాసుదేవరెడ్డిపై కేసు

ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డిపై సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. కంచికచర్ల మండలం మిగులూరు వాసి గద్దె శివరామకృష్ణ ఫిర్యాదుతో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ నెల 6న విజయవాడ శివారు ప్రసాదంపాడు సమీ పంలో ఒక వ్యక్తి కారులో ప్రభుత్వ ఫైళ్లు, కంప్యూటర్, ఇతర సామాగ్రి వేసుకుని వెళ్తుండగా గమనించిన శివరామకృష్ణ ఇదేంటని ప్రశ్నిస్తే.. సమా ధానం చెప్పకుండా అక్కడ నుంచి విసురుగా వెళ్లిపోగా, ఆరా తీస్తే అతను ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి అని తేలిందని ఫిర్యాదులో పేర్కొ న్నారు. శివరామకృష్ణ ఫిర్యాదు మేరకు సీఐడీ కేసు నమోదు చేసింది. ఐపీసీలోని 427, 379 రెడ్ విత్ 120(బీ) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నెల్లూరు సీఐడీ డీఎస్పీ పి.శ్రీనివాసులును దర్యాప్తు అధికారిగా నియమిస్తున్నట్లు సీఐడీ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగానే హైదరాబాద్‌లోని వాసుదేవ రెడ్డి నివాసంలో సీఐడీ అధికారులు తనిఖీలు చేశారు.











# లోకేష్ నివాసంలో సందడే సందడి!

## యువనేతను కలిసిన ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు, సినీ ప్రముఖులు

అమరావతి: కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలు, సినీ ప్రముఖులు పెద్ద సంఖ్యలో శుక్రవారం ఉండవల్లి నివాసానికి తరలివచ్చి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను అభినందించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించినందుకు ఎమ్మెల్యేలు, లోకేష్ పరస్పరం అభినందనలు తెలుపుకున్నారు. భారీ మెజారిటీలతో గెలిచిన ఎమ్మెల్యేలు, ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలను లోకేష్ అభినందించారు. సినీ నిర్మాత బండ్ల గణేష్, హీరో నిఖిల్.. లోకేష్ ని కలిసి అభినందనలు తెలిపారు. ఉండవల్లి నివాసంలో శుక్రవారం సుమారు 2 వేల మంది కార్యకర్తలను కలిసిన లోకేష్ అందరితో ఫోటోలు దిగారు.



























చైతన్యరథం



## కొత్త సీఎస్ నీరభ్ కుమార్

అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా సీనియర్ ఐఏఎస్ నీరభ్‌కుమార్ ప్రసాద్ నియమితులయ్యా రు. ఏపీ కేడర్‌కు చెందిన ఆయన 1987 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. నీరభ్‌కుమార్ ప్రసాద్‌ను సీఎస్‌గా నియమిస్తూ ప్రభుత్వం శుక్ర వారం ఉత్తర్వులు జారీచేసింది. అలాగే ప్రస్తుత సీఎస్ జవహర్ రెడ్డిని బదిలీచేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. నీరభ్ కుమార్ ప్రస్తుతం రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో చంద్ర బాబు ప్రభుత్వహయాంలో నీరభ్‌కుమార్ కీలక శాఖలకు ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. ఇప్పుడు ప్రధాన కార్యదర్శిగా ప్రమోట్ అయ్యారు. రాజకీయాలకు దూరంగా ఉండే ఆయనకు సమర్థు డైన అధికారిగా పేరుంది. ఇప్పటి వరకు సీఎస్‌గా ఉన్న జవహర్ రెడ్డి.. చంద్రబాబు ఆదేశం మేరకు సెలవుపై వెళ్ళి పోయారు. ఈ నెలాఖరున తిరిగి రాగానే పదవీ విరమణ చేస్తారు. ఆ తర్వాత జగన్ హయాంలో ఆయన తీసుకున్న వివాదాస్పద నిర్ణ యాలు, జారీ చేసిన వివాదాస్పద జీవోలు, విశాఖలో భూకబ్జాల పై విచారణకు ఆదేశించే అవకాశం ఉంది.

రాష్ట్ర విభజనకు ముందు తర్వాత ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడుకి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులలో సమ ర్థులు ఎవరో, ఎవరిని ఎక్కడ ఉపయోగించుకోవాలో బాగా తెలు సు. కనుక సమర్థులైన అధికారులను ఏరికోరి పదవీ బాధ్యతలు అప్పగిస్తున్నారు. మరోవైపు సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకా రానికి సమయం దగ్గర పడుతుండడంతో సీఎంఓ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. సీనియర్ ఐఏఎస్ అధికారి ముద్దాడ రవిచంద్ర సీఎంఓ బాధ్యతలు చూడనున్నారు. ఆయనను ముఖ్యమంత్రికి ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు.

### చంద్రబాబు వద్ద పని చేయటం ఆనందంగా ఉంది

చంద్రబాబు వద్ద సీఎస్‌గా పనిచేసే అవకాశం వచ్చినందుకు ఆనందంగా ఉందని నీరభ్ కుమార్ అన్నారు. సీఎం ప్రమాణ స్వీకారం, ప్రధాని పర్యటనపై అధికారులతో సమీక్షించానన్నా రు. మోదీ పర్యటన దృష్ట్యా భద్రత సంబంధించి డీజీపీకి పలు సూచనలు చేశానన్నారు. పలువురు సీఎంలు వస్తున్నందున ప్రోటోకాల్ కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామ న్నారు. ప్రతి విశిష్ట అతిథికి ఒక్కో బృందం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుందన్నారు.

# ఇంకా ఊహాలోకాల్లోనే జగన్‌రెడ్డి

## వైసీపీ ఘోరపరాజయానికి జగనే కారణమన్న వర్ల రామయ్య

- ఐదేళ్ల అరాచకాలు, విధ్వంసం వల్లే జనం ఛీ కొట్టారు
- నిజాలు మరిచి ప్రజలపై నిందలా
- జగన్ మొసలి కన్నీరు జనం నమ్మరు
- రక్తం అంటిన చేతులతో గవర్నర్‌కు ఫిర్యాదు సిగ్గుచేటు
- అధికారుల లెక్కలన్నీ తేలుస్తాం



అమరావతి(చైతన్యరథం): ఓటమిని జీర్ణించుకోలేని జగన్ రెడ్డి ఆత్మవిమర్శ చేసుకోకుండా జనాలపై నిందలు వేస్తున్నాడని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మండిపడ్డారు. మంగళగిరి లోని టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఓటమి తరవాత జగన్ మాట్లాడిన మాటలు ఆత్మస్తుతి, పరనిందలా ఉన్నాయన్నారు. తన ఓటమిని ఇతరులపై రుద్దుతున్నాడు. జగన్ బటన్ నొక్కితే జనం ఓటేయాలా? జగన్ చేసిన ఘోరాలు, నేరాలు జనం మరిచిపోలేదు. జగన్‌రెడ్డి ఇంకా ఊహాలోకాల్లోనే విహరిస్తున్నాడు. ప్రజలందరూ ఏకగ్రీవంగా ఈ జగన్ మాకొద్దు అంటూ ఓట్లు వేశారు. ఎన్నికల్లో ఇంత ఘోరంగా ఓడిపోయినా, ఆత్మవిమర్శ చేసుకోకుండా ఇతరులను నిందించటం వేయడం సిగ్గుచేటు. వైసీపీ ఘోర ఓటమికి జగన్ రెడ్డే కారణమని వర్ల స్పష్టం చేశారు.

### గతం మరిచి ఫిర్యాదులా..

మాచర్లలో జరిగిన రాక్షసకాండను జనం మర చిపోలేదు. సిగ్గులేకుండా మళ్లీ గవర్నర్ దగ్గరకు వెళ్లి ఫిర్యాదుచేస్తున్నారు. గతంలో స్థానిక ఎన్నికల్లో వైసీపీ నేతలు ఎంత దుర్మార్గంగా వ్యవహరించారో అందరికీ తెలుసు. మాచర్లకు వెళ్లిన బుద్దా వెంకన్న, బొండా ఉమాలపై ఐరన్ రాడ్లతో దాడిచేసినప్పుడు అవి నేరాలు, ఘోరాలు కాదా? మాచర్ల నియోజక వర్గంలోని ఆత్మకూరు గ్రామంలో వైసీపీ నేతల అరాచకాలకు భయపడి 250ఎస్సీ కుటుంబాలు ఆ ఊరిని విడిచి వెళ్లిపోయాయి. అప్పుడు మా అధినేత చంద్రబాబు వారిని స్వగ్రామంలోకి తీసుకెళ్లాలని బయలుదేరితే ఆయన బయటకు రాకుండా ఇంటి గేటుకు పోలీసులు తాళ్లుకట్టారు. అప్పుడే చంద్ర బాబు చెప్పారు.. నా ఇంటి గేటుకు కట్టిన తాళ్లు మీ అధికారానికి ఉరితాళ్లుగా మారతాయని. నేడు ఆ మాటలే నిజమయ్యాయి. నేడు గవర్నర్ దగ్గరకు వెళ్లి వైసీపీ నేతలు కల్లబొల్లి ఫిర్యాదులు చేస్తున్నారు. చంద్రబాబు ప్రచార రథంపై ఉన్నా కూడా హత్యా యత్నం కేసులుపెట్టి వేధించారు. టీడీపీ అరాచకం చేయాలనుకుంటే వైసీపీ నేతలు ఎవరూ మిగలరు. అది మా పంథా కాదు... మా అధినేత దానికి ఒప్పుకోరు. మా నాయకుడు ఒక్క కనుసైగ చేస్తే మీరు ఏమవుతారో తెలుసా? కౌంటింగ్‌లో రెండో రౌండ్‌కే మీ నేతలు పారిపోయారు. మీరు నేరాలు, ఘోరాలు చేశారు కాబట్టే రాష్ట్రాన్ని విడిచి పారిపోయే దుస్థితి వచ్చింది. మీరు గవర్నర్ వద్దకు వెళితే జనం నమ్ముతారా? ఇసుక, వైన్, ల్యాండ్, మైనింగ్ దేన్నీ వదలకుండా దోచుకున్నారు. వంద కోట్లు తిన్న రాబందులా.. మూతికి ఉన్న రక్తాన్ని తుడుచుకుని గవర్నర్ దగ్గరకు వెళితే నమ్ముతారా అని వర్ల ప్రశ్నించారు.

### దమనకాండను దళితులు మర్చిపోలేదు

ఇప్పుడు ఏడుపు ముఖం పెట్టుకుని మాట్లాడితే దళితుల మనసులు కరగవు. నా ఎస్సీలు,నాఎస్టీలు అన్నారు... వారి కోసం ఏం చేశారు? 29 ఎస్సీ నియోజకవర్గాల్లో 2 మాత్రమే వైసీపీ గెలిచింది. మిగిలిన 27 కూటమి గెలిచింది. వైసీపీకి ఎస్సీలు బానిసలు కాదని.. నిరంకుశ, నియంతృత్వ, ప్రజా వ్యతిరేక పాలనను ఎస్సీలు ఛీ కొట్టారని ఎన్నికల ఫలితాలతో అర్థం అవుతోంది. ఆ రెండు సీట్లు కూడా మా వారు చేసిన చిన్న పొరపాటు కారణం గానే వైసీపీ గెలిచింది. ఎస్సీలం దరూ చంద్రబాబు నాయకత్వాన్ని కోరుకున్నారు. ఇకనైనా జగన్ పరనింద మానుకోవాలని వర్ల హితవు పలికారు.

ఓట్లు వేయలేదని ఏడుపు మొఖంతో జగన్ మాట్లాడతున్నాడు. జగన్ రెడ్డి ఏం చేశాదని జనం ఓట్లు వేస్తారు. అందుకే దళితులందరూ ఏకతాటి పైకి వచ్చి ఓడించారు. జగన్‌రెడ్డి పాలనలో దళితు లపై జరిగిన దమనకాండను ఆ వర్గీయులెవరూ మర్చిపోలేదు. మాస్క్ అడిగినందుకు దళిత డాక్టర్ సుధాకర్‌ను చంపేశారు. ఇసుక దందా జరుగు తోందని చెప్పినందుకు పోలిస్‌స్టేషన్‌లో వరప్రసాద్ కు శిరోముండనం చేశారు. దళిత బిడ్డపై వైసీపీ వర్గాలు సామూహిక అత్యాచారం చేసి పోలిస్టేషన్ ముందు పడేశారు. మాస్క్ పెట్టుకోలేదని దళిత బిడ్డ కిరణ్ కుమార్‌ను పోలీసులు కొట్టి చంపేశారు. కల్తీ మద్యం ఎక్కువ రేట్లకు అమ్ముతుండటంపై మాట్లాడిన ఓంప్రతాప్‌ను తెల్లారేసరికి చంపేసి ఉరేసుకున్నట్లు చిత్రీకరించారు. పులివెందులలో దళిత మహిళ నాగలక్ష్మిని కొట్టి అత్యాచారం చేసి చంపేశారు.వెటర్నరీ డాక్టర్ అచ్చెన్న హత్యచేశారు. నకరికల్లులో గిరిజన మహిళను, టంగుటూరు దగ్గ ర దళిత మహిళను ట్రాక్టర్‌తో తొక్కించి చంపే శారు. చంద్రయ్య అనే వ్యక్తి జై చంద్రబాబు అన్నం దుకు పీక కోసి చంపేశారు. అమరావతిలో దళిత రైతులకు బేడీలు వేసి వీధుల్లో తిప్పటాన్ని కూడా మా దళిత బిడ్డలు మరిచిపోలేదని వర్ల అన్నారు.

### అధికారుల లెక్కలన్నీ తేలాలి

కొల్లి రఘురామరెడ్డి, సునీల్‌కుమార్, డిప్యుటేష న్‌పై వచ్చి వైసీపీ నేతల అరాచకాలకు సహకరిం చిన అధికారుల లెక్కలన్నీ తేలాలి. చట్టబద్ధంగానే వీరిపై చర్యలు ఉంటాయి. జగన్ ముఖ్యమంత్రిత్వా న్ని అడ్డుపెట్టుకుని కోర్టులను కూడా తప్పుదారి పట్టించారు. సీబీఐ దాఖలు చేసిన 11 ఛార్జిషీట్లలో ఒక్క రోజు కూడా కోర్టుకు హాజరు కాలేదు. జగన్ రెడ్డి ప్రతి శుక్రవారం కోర్టుకు హాజరు కావాలి. కానీ ఎప్పుడూ హాజరు కాలేదు. జగన్‌రెడ్డికి ఎందు కు ఇంత వెసులుబాటు కల్పించారో కోర్టు స్పష్టత ఇవ్వాలి. ఆయన మీద ఉన్న 11 కేసుల్లో వెంటనే విచారణ చేపట్టి నిర్దోషి అయితే వదిలేయాలి.. దోషి అయితే శిక్ష విధించాలి. జగన్ ఇకనైనా మొసలి కన్నీరు ఆపాలి. జగన్‌రెడ్డి భవిష్యత్‌లో చెల్లించాల్సిన మూల్యం చాలా ఉందని వర్ల స్పష్టం చేశారు.

# సీఎంఓలో ముగ్గురు అధికారులపై వేటు

- పూనం మాలకొండయ్య, రేవు ముత్యాలరాజు, భరత్ గుప్తా బదిలీ
- జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశం



అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఈ నెల 12వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముందే ముఖ్యమంత్రి కార్యా లయం (సీఎంఓ)లో కొత్త టీమ్ కోసం కసరత్తు నడుస్తోంది. గత ప్రభుత్వంలో కీలక స్థానాల్లో ఉండి.. అనేక ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులపై వేటు పడుతోంది. ఇప్పటికే సీఎస్ జవహర్‌రెడ్డి సెలవులపై వెళ్లిపోగా.. ఇప్పుడు మరికొందరు ఉన్నతాధికారులపై వేటు పడింది. ఈ క్రమంలోనే జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సీఎంఓలో కీలక పాత్ర పోషించిన అధికారులపై బదిలీ వేటు పడింది. జగన్ పేషీలో ఉన్న ముగ్గురు ఐఏఎస్ అధికారులను జీఏడీలో రిపోర్ట్ చేయాలని నూతన సీఎస్ నీరభ్‌కుమార్ ఆదేశిం చారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. జగన్ హయాంలో సీఎంఓ స్పెషల్ చీఫ్ సెక్రటరీ పూనం మాలకొండయ్య, సెక్రటరీ రేవు ముత్యాలరాజు, అడిషనల్ సెక్రటరీ భరత్ గుప్తాలను బదిలీ చేసింది ప్రభుత్వం. వీరందరినీ జీఏడీలో రిపోర్ట్ చేయాలని సీఎస్ ఆదేశించారు. జగన్ పేషీలో ఉన్న అధికారులను తొలగించి.. వారి స్థానంలో కొత్త వారిని నియమిస్తున్నారు. సీఎంఓ ప్రధాన కార్యదర్శిగా ముద్దాడ రవిచంద్ర ను నియమించారు. అలాగే మరికొందరు కీలక అధికారులకు సీఎంఓలో ప్రాధాన్యత కల్పించనున్నట్లు తెలుస్తోంది.

# రామోజీకి అస్వస్థత

ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆయనను హైదరాబాద్‌లోని స్టార్ హాస్పటల్‌కు తరలించగా వెంటిలేటర్ మీద వైద్యం అందిస్తున్నారు. రామోజీరావుకు ఇటీవల వైద్యులు స్టంట్లు వేశారు.

*త్వరగా కోలుకోవాలి: లోకేష్*

అస్వస్థతకు గురైన ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు త్వరగా కోలుకోవాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆకాంక్షించారు. ప్రజాపక్షమై అక్షరాన్ని నిలిపిన మార్గదర్శి రామోజీరావు...సంపూర్ణ ఆరోగ్యంతో నిండు నూరేళ్లు సమాజ క్షేమం కోసం పనిచేయాలని ప్రజలంతా తమ ఇష్టదైవాలను ప్రార్థిస్తున్నారని లోకేష్ పేర్కొన్నారు.

# చంద్రబాబు ప్రమాణ స్వీకార ఏర్పాట్లపై సీఎస్, డీజీపీతో అచ్చెన్నాయుడు సమీక్ష

అమరావతి: ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమ ఏర్పాట్లపై సీఎస్, డీజీపీ, ఇతర ఉన్నతాధికారులతో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు శుక్రవారం సమీక్షించారు.

కార్యక్రమానికి పలువురు వీఐపీలు హాజరవుతున్నందున రాకపోకలకు, వసతికి చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమానికి లక్షల సంఖ్యలో ప్రజలు వస్తారని అచ్చెన్నాయుడు చెప్పారు. పలువురు ప్రముఖులు, పెద్ద సంఖ్యలో జనం హాజరవుతున్నందున ఎలాంటి ఆటంకాలు లేకుండా ఏర్పాట్లన్నీ అత్యంత పకడ్బందీగా చేయాలని అచ్చెన్నాయుడు సూచించారు.

చైతన్యరథం



ఢిల్లీలోని మాజీ ఎంపీ గల్లా జయదేవ్ నివాసంలో సమావేశమైన అనంతరం టీడీపీ అధినేత చంద్రబాబుతో పార్టీ ఎంపీల గ్రూప్‌ఫొటో



*12న ఉదయం 11.27కి నాలుగోసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ముహూర్తం కుదిరింది. గన్నవరం విమానాశ్రయం సమీపంలోని కేసరపల్లి ఐటీ పార్క్‌వద్ద మహోత్సవ నిర్వహణకు సభాస్థలి నిర్ణయమైంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకార ఏర్పాట్లపై తాడేపల్లి పంచాయతీరాజ్ కమిషనరేట్‌లో సీఎస్, డీజీపీ, ఉన్నతాధికారులతో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సమీక్షించారు. వీఐపీల రాకపోకలకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ప్రమాణస్వీకార కార్యక్రమానికి లక్షల సంఖ్యలో ప్రజలు వస్తారని, ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని అధికార యంత్రాంగానికి అచ్చెన్నాయుడు సూచించారు.*



# మెగా డీఎస్సీపైనే తొలిసంతకం

**- తెలుగుయువత నేత రవినాయుడు**

తిరుపతి (చైతన్యరథం): టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే తొలి సంతకం డీఎస్సీపైనే చేస్తానని అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించడం యువతకు భరోసాను కల్పించినట్లు అయిందని, కాబట్టే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో యువత అంతా ఏకపక్షంగా కూటమికే జై కొట్టారని తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు స్పష్టం చేశారు. ఈఎన్నికల్లో యువత ఎన్డీయే కూటమికి మద్దతు తెలిపి అపూర్వ విజయాన్ని అందించారని, భవిష్యత్తులో వారికి పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పించేందుకు చంద్రబాబు ప్రభుత్వం పనిచేయబోతుందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే తమకు ఉపాధి లభిస్తుందని ప్రజలంతా భావించారని, అఖండ మెజారిటీతో కూటమిని గెలిపించడం సంతోషంగా ఉందన్నారు. చంద్రబాబు సీఎం కాలంటూ ఆకాంక్షిస్తూ ఓటేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తూ శుక్రవారం తిరుపతిలో టీఎన్ఎస్ఎఫ్, తెలుగుయువత నాయకుల ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు మాట్లాడుతూ... జగన్మోహన్‌రెడ్డి గత ఐదు సంవత్సరాలుగా యువత, విద్యార్థి లోకాన్ని అనేక విధాలుగా ఇబ్బందులు పెట్టడంతో పాటు ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా ఉపాధి కల్పించకుండా యువత భవిష్యత్తును నాశనం చేశారని అన్నారు. జూన్ 4తో రాష్ట్రంలో నరకాసుర వధ జరిగిందని... ఒక రాక్షసుడిని ఈ రాష్ట్రం నుండి ఓటు ద్వారా తరిమికొట్టామని ప్రజలంతా సంతోషంగా ఉన్నారని అన్నారు. రాష్ట్రానికి పట్టిన శని వదిలిపోయింది భావిస్తున్నారని అన్నారు. రాష్ట్రానికి మంచిరోజులు వచ్చాయని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు... రాబోయే రోజుల్లో అమరావతి, పోలవరం ప్రాజెక్టులను పూర్తిచేయడం జరుగుతోందన్నారు. అభివృద్ధిని వికేంద్రీకరించి ప్రతి జిల్లాకు పరిశ్రమలు తీసుకొచ్చేలా చంద్రబాబు కృషి చేస్తారని తెలిపారు.

కొట్టే హేమంత్ రాయల్ మాట్లాడుతూ... గత ప్రభుత్వం విద్యార్థులకి, నిరుద్యోగులకి అన్యాయం చేసిందని తమకు జరిగిన అన్యాయాన్ని ఓటు రూపంలో వేసి వైసీపీ ప్రభుత్వానికి యువత బుద్ధి చెప్పారని అన్నారు. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో నిరుద్యోగం తాండవించిందని, ముఖ్యంగా చదువుకున్న యువత ఉద్యోగాలు లేక అనేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. అనేక హామీలు ఇచ్చిన జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని అందుకే ప్రజలు వైసీపీకి ప్రతిపక్ష హెూదా లేకుండా చేశారని అన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ ప్రకటనతో పాటు 20 లక్షల ఉద్యోగాలు కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందని, భవిష్యత్తులో యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత పార్లమెంట్ అధ్యక్షులు కృష్ణ యాదవ్ ,రాష్ట్ర కార్యదర్శి ఆర్ పి శ్రీనివాసులు ,రాష్ట్ర అధికార ప్రతినిధి తోట వాసు, శ్రీనివాస్ యాదవ్, నియోజకవర్గ అధ్యక్షులు కరణం సందీప్, రంజిత్ నాయుడు, రఫీ, గోపి, లోకేష్ రాయల్, జెడి ప్రసాద్, శ్రీరామ్ బాబి, టిఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షులు వెంకటేష్ యాదవ్,జ్ఞానేష్, ప్రశాంత్ సాయి,విష్ణు, శీను తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో ముస్లిం రిజర్వేషన్లు కొనసాగుతాయి

**అనుమానం అక్కర్లేదన్న కనకమేడల**



న్యూఢిల్లీ: రాష్ట్రంలో ముస్లిం రిజర్వేషన్లు కొనసాగుతాయని టీడీపీ నేత, మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి అనుమానం అక్కర్లేదని తేల్చి చెప్పారు. ఢిల్లీలో శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ..ప్రధానమంత్రిగా మోదీ ఈనెల 9న ప్రమాణ స్వీకారం చేస్తారని వివరించారు. కేంద్రం ముందు టీడీపీ ఎలాంటి డిమాండ్లు ఉంచుతుందన్న ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. దానికిప్పుడు సమయం కాదని పేర్కొన్నారు. తాము ఎన్డీయే భాగస్వాములమని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి తీసుకోవాల్సినవి చాలానే ఉన్నాయని, అదంతా పద్ధతి ప్రకారం జరుగుతుందని తెలిపారు. గత ఐదేళ్ల పాలనలో ఆంధ్రప్రదేశ్ 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందని, దానిని పునర్నిర్మించేందుకు తొలి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ముస్లిం రిజర్వేషన్లను కొనసాగిస్తామని, ఈ విషయంలో ఎలాంటి సమస్యా లేదని తేల్చి చెప్పారు.

# సీఐడీ చీఫ్ సంజయ్, విజిలెన్స్ ఐజీ కొల్లి బదిలీ

అమరావతి: సీఐడీ చీఫ్ ఎన్.సంజయ్‌ను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. సంజయ్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. అదే విధంగా విజిలెన్స్ ఐజీ కొల్లి రఘురామిరెడ్డిని కూడా బదిలీ చేశారు. రఘురామిరెడ్డిని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. సీఐడీ, విజిలెన్స్ అదనపు బాధ్యతలను డీజీపీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

## గనుల వెంకటరెడ్డిపై వేటు

వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్న పలువురు అధికారులపై బదిలీ వేటు పడింది. ఫైబర్‌నెట్ ఎండీ మధుసూదన్‌రెడ్డి, ఏపీఎండీసీ ఎండీ వెంకటరెడ్డిని బదిలీ చేస్తూ శుక్రవారం రాత్రి ఆదేశాలు జారీ అయ్యాయి. వీరిని సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. ఆయా బాధ్యతలను పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్‌కు అప్పగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

# నీ ఓటమిని ప్రజలపై రుద్దడం న్యాయమా జగన్‌రెడ్డీ!

**- పాపాలు చేసి ప్రజలను నిందిస్తారా**

**- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు కొండారెడ్డి ధ్వజం**



అమరావతి: రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా దళిత, గిరిజనులు తెలుగుదేశం పార్టీకి బ్రహ్మరథం పట్టారని, మొత్తం 36 ఎస్సీ, ఎస్టీ స్థానాలకు గాను 32 స్థానాల్లో టీడీపీ జయకేతనం ఎగురవేయడం రాష్ట్రానికి శుభపరిణామమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు డాక్టర్ కొండారెడ్డి నరహరి వరప్రసాద్ అన్నారు. ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన జగన్‌రెడ్డి తన తప్పులపై ఆత్మవిమర్శ చేసుకోకుండా ఇప్పటికీ ప్రజలను నిందించడం బాధాకరమని అన్నారు. ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత జగన్‌రెడ్డి తీరు భిన్నంగా ఉందని, తాను బటన్లు నొక్కినా ప్రజలు ఓట్లు వేయలేదన్నట్లు మాట్లాడటం విచిత్రంగా ఉందన్నారు. జగన్ రెడ్డి బటన్ నొక్కితే ప్రజలు ఓట్లు వేయాలా అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కేవలం రెండు ఎస్సీ, రెండు ఎస్టీ స్థానాలలో మాత్రమే వైసీపీ గెలవడం సిగ్గుచేటని, ఎస్సీ, ఎస్టీలు జగన్ రెడ్డికి బానిసలు కాదని.. నిరంకుశ, నియంతృత్వ, అప్రజాస్వామిక, ప్రజా వ్యతిరేక పాలన సాగించిన జగన్‌రెడ్డిని దళిత, గిరిజనులు ఛీ కొట్టారని ఎన్నికల ఫలితాలతో అర్థం అయిందన్నారు. అయినా జగన్‌రెడ్డి ఆత్మవిమర్శ చేసుకోకుండా ప్రజలను విమర్శించడం సైకోతనానికి నిదర్శనమన్నారు. జగన్ పాలనలో గిరిజనులపై జరిగినన్ని దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు ఎన్నడూ జరగలేదన్నారు. గిరిజనులపై దమనకాండ జరుగుతున్నా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. గిరిజనులపై దాడులను ప్రభుత్వమే ప్రోత్సహించింది. నాగరిక సమాజం సిగ్గుతో తలదించుకునేలా గిరిజన యువకుడు మోటా నవీన్ నోట్లో మూత్ర విజర్జన చేసారు. ఇలాంటి దుర్మార్గాలు, దౌర్జన్యాలు చేస్తే ప్రజలు ఛీకొట్టకా ముద్దుపెట్టుకుంటారా? నువ్వు చేసిన నేరాలు, ఘోరాలే నిన్ను ప్రజలకు దూరం చేశాయి. ఇప్పటికైనా ఆత్మవిమర్శ చేసుకుని ఓటమిని అంగీకరించి హుందాతనంగా వ్యవహరించాలని సూచించారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే జగన్ రెడ్డి రద్దు చేసిన దళిత, గిరిజన సంక్షేమ పథకాలు పునరుద్ధరిస్తారన్నారు. తెలుగుదేశం పార్టీని ఈ స్థాయిలో ఆదరించిన దళిత, గిరిజనులకు కొండారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

# ఆరు నెలలు టైం ఇస్తావా? ఐదేళ్లు ఏం చేశావ్?

- ఐదేళ్లలో కార్యకర్తల్ని ఏ రోజైనా పట్టించుకున్నావా
- 2019 తర్వాత మీరు సాగించిన దమనకాండ మరచిపోయారా
- పరిటాల సునీతమ్మ అందరూ సంయమనంగా ఉండాలని చెబుతున్నారు



రాప్తాడు (చైతన్యరథం): మా ప్రభుత్వం ఇంకా ఏర్పడకముందే.. మాకు 6నెలలు సమయం ఇస్తాం.. అన్నీ చేయమని అడుగుతున్నావ్.. మరి ఐదేళ్లుగా అధికారంలో ఉండి ఏం చేశావని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి పై రాప్తాడు నియోజకవర్గ టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాప్తాడులోని టీడీపీ కార్యాలయంలో ఆరు మండలాల కన్వీనర్లు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి చేసిన వ్యాఖ్యల మీద తీవ్రంగా స్పందించారు. టీడీపీ నాయకులు ఇప్పుడు వైసీపీ నాయకులపై దాడులు చేస్తున్నారని మాట్లాడుతున్నారు.. అసలు 2019లో మీరు గెలిచిన తర్వాత ఏం చేశారో ఒకసారి గుర్తు తెచ్చుకోవాలన్నారు. ప్రజలకు తాగునీరు అందించే వాటర్ ప్లాంట్ల దగ్గర నుంచి ఎక్కడ చూసినా విధ్వంసం సృష్టించిన సంగతి మర్చిపోయారా అని నిలదీశారు. గ్రామాల్లో టీడీపీ సానుభూతిపరుల దగ్గర నుంచి వందల మందిపై దాడులకు పాల్పడిన సంఘటనలు ఎలా మర్చిపోయారన్నారు. ఆ రోజు పోలీసులకు ఫిర్యాదు చేసినా.. కోర్టు మెట్లు ఎక్కినా మీరు దాడులు ఆపారా అని ప్రశ్నించారు. ఇవాళ అక్కడక్కడ జరుగుతున్న సంఘటనలను మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మకు ఆపాదించడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు నుంచి నేటి వరకు ఎవరూ ఎక్కడా సంయమనం కోల్పోవద్దని.. ఎవరైనా రెచ్చగొట్టినా.. శాంతియుతంగా ఉండాలని పరిటాల సునీత చెబుతూనే ఉన్నారన్నారు. ఇలాంటి మాట మీరు ఈ ఐదేళ్లలో ఏరోజైనా చెప్పారా అని నాయకులు ప్రకాష్ రెడ్డిని ప్రశ్నించారు. ఐదేళ్లుగా పోలీసులను, రెవెన్యూ అధికారులను, వ్యవస్థల్ని అడ్డుపెట్టుకుని మీరు చేసినవి ప్రజలు ఎప్పటికీ మర్చిపోరన్నారు. ఏరోజు నువ్వు మీ కార్యకర్తల్ని కూడా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. మేము ఇంకా ప్రమాణ స్వీకారం చేయకముందే ఇచ్చిన హామీల నెరవేర్చేందుకు ఆరు నెలలు టైం అంటున్నావ్.. ఐదేళ్లుగా మీరు ఏం చేశారో చెప్పాలన్నారు. టీడీపీ హయాంలోనే మంజూరైన పనులు కూడా చేయలేని దద్దమ్మలు మీరని విమర్శించారు. కనీసం సొంత గ్రామానికి రోడ్డు వేసుకోలేకపోయావని.. నువ్వా అభివృద్ధి గురించి మాట్లాడేది అన్నారు. జగన్ రెడ్డితో పాటు నీలాంటి ఎమ్మెల్యేలంతా కలసి రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరిలా చేశారన్నారు. మీరు ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని.. కచ్చితంగా మేము ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. అయితే మీరు మీ సోదరులు గతంలోలా ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేది లేదని.. జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ముందు మీరు ఎందుకు ఓడిపోయారో కారణాలు తెలుసుకోవాలని.. దందాల, దౌర్జన్యాలు ఆపాలన్నారు. గ్రామాల్లో మా కార్యకర్తలు కూడా సంయమనంతో ఉండాలని వారు విజ్ఞప్తి చేశారు.

# ఎన్డీయే హయాంలో ప్రారంభమైంది... మళ్లీ ఎన్డీయే కూటమిలోనే పూర్తిచేస్తాం

- మూడు నెలల్లో మోరంపూడి ఫ్లై ఓవర్ వంతెన ప్రారంభిస్తాం
- జాతీయ రహదారిపై ఇంకా నాలుగు ఆర్ఓబీలు రావాల్సి ఉంది
- అధికారులతో మోరంపూడి ఫ్లై ఓవర్ నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించిన ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం (చైతన్యరథం) : మోరంపూడి ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణం నాడు ఎన్డీయే కూటమి హయాంలో ప్రారంభించగా మరో రెండు మూడు నెలల్లో ఎన్డీయే కూటమి హయాంలో ప్రారంభించుకోబోతున్నామని రాజ మహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. దాదాపుగా పూర్తి కావచ్చిన మోరంపూడి ఫ్లై ఓవర్‌ను శుక్రవారం ఆయన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, ఎన్‌హెచ్ ఏఐ అధికారులు, ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు తది తరులతో కలిసి పరిశీలించారు.

ఈ సంధర్భంగా ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకూ ఎన్డీయే అధికారంలో ఉందని, 2019లో ప్రభు త్వం మారిందన్నారు. అయితే అప్పటి ఎంపీ మాగంటి మురళీమోహన్ కృషి కారణంగానే మోరంపూడి ఫ్లై ఓవర్ మంజూర య్యిందన్నారు. దాని నిర్మాణానికి శంకుస్థాపన కూడా ఆయన హయాంలోనే జరిగిందన్నారు. అటు తరువాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ హయాం లో వంతెన నిర్మాణానికి మళ్లీ శంకుస్థాపన చేయగా ఆ కార్యక్రమానికి హాజరైన నితిన్ గడ్కారీ కొత్త పని కాదు అనే ఉద్దేశంతోనే పూజ లు చేశారని ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. అయితే నాడు గాల్లో నెగ్గిన స్థానిక మాజీ ఎంపీ (అతని పేరు ఉచ్చరించేందుకు కూడా తాను సాహసించడం లేదన్నారు) మోరం పూడి ఫ్లై ఓవర్‌ను తానే మంజూరు చేయించి నట్టు తప్పు దు ప్రచారం చేసి ప్రజలను మభ్యపెట్టే ప్రయ త్నం చేశారని విమర్శించారు. కేవలం అతని తప్పిదం వల్లే వంతెన నిర్మాణం చాలా ఆలస్య మైందన్నారు. ప్రస్తుతం ఇంజనీర్లు, అధికారుల ను అడగ్గా వాతావరణం అనుకూలిస్తే రెండు మూడు నెలల్లో వంతెన ప్రారంభించవచ్చని అంటున్నారని తెలిపారు.

**గుమస్తా పని... కమీషన్ కోసం కక్కుర్తి :**

స్థానిక మాజీ ఎంపీ మోరంపూడి ఫ్లై ఓవర్ విషయంలో చేసిందని కేవలం గుమస్తా పని మాత్రమేనని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. రోజూ రావడం ఏదో తానే ఇంజనీర్ అయినట్టు నెత్తిన ఒక టోపీ పెట్టుకుని చెయ్యి పైకి ఎత్తి బిల్డప్ ఇవ్వడంతో అతను కాల యాపన చేశాడని దుయ్యబట్టారు. పద్దులు రాసు కోవడం, ఎక్కడ ఎంత కమీషన్ వస్తుందో లెక్క లు వేసుకోవడమే ఆ గుమస్తా నిత్యకృత్యంగా పని చేశాడన్నారు.

**మా హయాంలో ఎలాంటి నిర్లక్ష్యం జరగదు :**

క్రమ శిక్షణకు... పద్ధతికి మారు పేరైన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి హయాంలో ప్రజల సంక్షేమం విషయంలో కానీ, అభివృద్ధి విషయంలో కానీ ఎలాంటి నిర్లక్ష్యం జరగదని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. రెండు మూడు నెలల్లో మోరంపూడి ఆర్ ఓ బీ ప్రారంభిస్తామన్నారు. ప్రొటో కాల్ ప్రకారం ఎం పీ పురంధేశ్వరి, స్థానిక ఎమ్మెల్యేగా తాను, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అందరూ ఉంటారు. అలాగే ఇక్కడ గుమస్తా పని చేసిన మాజీ ఎంపీని కూడా పిలుస్తామి చమత్కరించారు.

# పేదలను మోసం చేస్తే వారికి మండద జగన్ రెడ్డి

- లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్



విజయవాడ (చైతన్యరథం) : పేదలకు ఇవ్వవలసిన 14 వేల కోట్ల రూపాయలను ఎన్నికల ముందు దొంగ బటన్ నొక్కి ఇంత వరకు ప్రజలకు అందకుండా చేస్తే మండ దా జగన్‌రెడ్డి అంటూ లుక్కా సాయి రాం ప్రసాద్ గౌడ్ మండి పడ్డారు. మొగల్రాజపురంలోని తన పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ ప్రతిపక్ష హోదాలో ఉన్న జగన్ రెడ్డి ఎన్నికల హామీలో భాగంగా అవ్వ తాతలకు పెన్షన్ 3000 ఇస్తానని చెప్పి హామీ ఇచ్చి, ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఈ ఐదు సంవత్సరాలలో సంవత్సరానికి 250 పెంచుకుంటూ పోతానని చెప్పి మాట తప్పి మడమ తిప్పావని, ఇది అవ్వ తాతలకు చేసిన మోసం కాదా జగన్ రెడ్డి అక్క చెల్లెమ్మలు 45 సంవత్సరాలకే పెన్షన్ ఇస్తానని చెప్పి ఐదు సంవత్సరాలు ఆ ఊసే ఎత్తకుండా అక్క చెల్లెలను మోసం చేసింది నువ్వు కదా జగన్ రెడ్డి? ప్రతిపక్ష హోదాలో ఉన్న నువ్వు నిండు అసెంబ్లీ సాక్షిగా రాజధాని అమరావతి అని ఒప్పుకొని, 30 వేల ఎకరాలు భూములు కావాలని మాట చెప్పి, గద్దె నెక్కగానే అమరావతి రాజధాని నాశనం చేసి, మూడు రాజధానుల డ్రామాకి తెరలేపింది నువ్వు కాదా జగన్ రెడ్డి..? ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలుంటే అంతమందికి అమ్మఒడి ఇస్తానని చెప్పి గద్దెనెక్కిన తరువాత ఇంట్లో ఒక్కరికి అమ్మ ఒడి ఇచ్చి మోసం చేసింది నువ్వు కాదా జగన్ రెడ్డి? పేదలకు ఇవ్వవలసిన 14 వేల కోట్ల రూపాయలను ఎన్నికల ముందు దొంగ బటన్ నొక్కి ఇంత వరకు ప్రజలకు అందకుండా చేసింది నువ్వు కాదా జగన్ రెడ్డి? పండించిన పంటను రైతుల నుండి ధాన్యాన్ని కొనుగోలు చేసి ఇంతవరకు డబ్బు చెల్లించకుండా రైతులను మోసం చేసింది నువ్వు కదా జగన్ రెడ్డి? నిరుపేదలకు ఇచ్చే పండుగ కానుకలను కూడా తీసేసి పేదలను మోసం చేసింది నువ్వు కాదా జగన్ రెడ్డి? ఇచ్చిన హామీలలో 99% అమలు చేశానని చెప్పి ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నించింది నువ్వు కాదా జగన్ రెడ్డి? అందుకే అన్ని వర్గాల ప్రజల నుండి ఇంత దారుణమైన తీర్పు నీకు ఇచ్చారు. రాజధాని లేని రాష్ట్రంగా నువ్వు మార్చావు. ప్రజలు ప్రతిపక్షం లేని రాష్ట్రంగా నీకు తీర్పు ఇచ్చారు జగన్ రెడ్డి! ఇన్ని దుర్మార్గాలు చేసిన జగన్ రెడ్డికి అవ్వ తాతలు, అక్క చెల్లెమ్మలు, రైతులు,విద్యార్థులు, బడుగు బలహీన వర్గాలు ఇచ్చిన తీర్పు 11 సీట్లు అన్నారు. అహంకారంతో, అధికార మదంతో ప్రజలను మోసం చేస్తే జగన్ రెడ్డి లాంటి నాయకులకు ఇదే గతి పడుతుందన్నారు.

# వైసీపీ కవ్వింపులకు ప్రతి చర్యలొద్దు

- పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ సూచన



పల్నాడు (చైతన్యరథం): ఓటమి నైరాశ్యంలో తమకు ఓట్లు వేయని ప్రజలు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ శ్రేణులు, నాయకులు గొడవలకు దిగుతూ కవ్వింపు చర్యలకు పాల్పడటం బాధాకరమని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ వ్యాఖ్యా నించారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు ఇకనైన బుద్ధితెచ్చుకుని ప్రవర్తించాలని సూచించారు. నరసరావుపేటలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గడిచిన నాలుగు రోజులుగా వైసీపీ నేతలు గొడవలను ప్రోత్సహిస్తున్నారని, ఆ పార్టీ కార్యకర్తలను తమతో నిలుపుకోవాలన్న ఉద్దేశంతో ఈ వ్యవహారానికి పాల్పడటం మంచి పద్ధతి కాదన్నారు. మాచర్ల, సత్తెనపల్లి నర్సరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ నియోజకవర్గాల్లో వైసీపీ శాంతి భద్రతలకు భంగం కలిగిస్తుందన్నారు. పోలీసులు కఠినంగా వ్యవహరించి అరాచక శక్తులను అణిచివేయాలని కోరారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు శాంతి భద్రతలతో పాటు ప్రజల ప్రశాంత జీవనానికి ఆటంకం కలగకుండా పోలీసులకు తోడ్పాటు అందించాలని సూచించారు.

# యువనేత నారా లోకేష్‌కి శుభాకాంక్షలు తెలిపిన ఎం.ధారునాయక్

**అమరావతి (చైతన్యరథం):** టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ని టీడీపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారునాయక్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమికి ప్రజలు ఏకపక్షంగా మద్దతు ఇచ్చారని, ఇంతటి భారీ విజయం సాధించడం సంతోషంగా ఉందన్నారు. గాడితప్పిన ఏపీని తిరిగి అభివృద్ధి బాటలో నడిపించాలంటే అది ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమని ప్రజలు బలంగా నమ్మారని, ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని ఎప్పటికి ఒమ్ము చేయబోమని ధారునాయక్ వెల్లడించారు. అరాచక పాలన అంతం కావడం పట్ల ప్రజలు సంతోషంతో ఉన్నారని, రాష్ట్రంలో జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై విపరీతంగా దాడులు చేశారని ఆయన మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వానికి వారు గట్టి బుద్ధి చెప్పారన్నారు. వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు మైనింగ్, లిక్కర్ని ఆదాయ వనరులుగా మార్చుకున్నారన్నారు.

విపరీతంగా మైనింగ్ చేసి పర్యావరణానికి హాని కలిగించారని, పిచ్చి పిచ్చి మద్యం బ్రాండ్లతో పేదల జీవితాలతో ఆటలాడుకున్నారని ధారునాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



# ఐదేళ్ల అరాచకాల ప్రక్షాళనపై ఇప్పుడు చూస్తోంది టీజర్ మాత్రమే

- కూటమి నాయకులు, ప్రజల నుంచి జీవీకి అభినందనల వెల్లువ



వినుకొండ (చైతన్యరథం) : ఐదేళ్లుగా దారితప్పిన అధికారులందరికీ నో ఎంట్రీ బోర్డు, ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి హైదరాబాద్ నివాసంలో సోదాలు కూటమి ప్రభుత్వం ఎలా ఉండబోతోంది అనడానికి టీజర్ మాత్రమేనని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వ్యాఖ్యానించారు. తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి చెబుతున్నట్లు అయిదేళ్లుగా వైసీపీ చేసిన లాండ్, శాండ్, మైనింగ్, లిక్కర్ మాఫియాల మొత్తం నిగ్గు తేల్చి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ అధినేత, కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధిపతి పవన్‌కల్యాణ్, లోకేష్ కూడా మొదట్నుంచి అదే చెబుతున్నారని గుర్తు చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో అఖండ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందిన జీవీ ఆంజనేయులను శుక్రవారం కూటమి నాయకులు, కార్యకర్తలు అభినందనలతో ముంచెత్తారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు వినుకొండ కొత్తపేటలోని ఆయన నివాసానికి భారీగా తరలివచ్చారు. జీవీకి అభినందనలు తెలిపేందుకు వచ్చిన శ్రేణులతో సందడి వాతావరణం నెలకొంది. అనంతరం జీవీ ఆంజనేయులు మీడియాతో మాట్లాడుతూ... జగన్ సీఎంగా అయిదేళ్ల పాటు వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, వాటిని చక్కదిద్దటం మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. చంద్రబాబు, పవన్, లోకేష్ ముందే చెప్పినట్లు తప్పు చేసిన వాళ్లను వదిలేది లేదని, తప్పు చేయని వాళ్లకు ఎలాంటి ఇబ్బంది ఉండదనీ స్పష్టం చేశారు. ప్రత్యేకించి లోకేష్ యువగళం పాదయాత్రలో ప్రస్తావించిన రెడ్‌బుక్‌లో ఉన్న వారందరూ వారివారి తప్పులకు మూల్యం చెల్లించాల్సిందేనన్నారు. అయిదేళ్ల అరాచకాలకు సంబంధించిన పైళ్లు మాయం చేసి, ఆధారాలు ధ్వంసం, సాక్ష్యాలు చెరిపేసి తప్పించుకుని పోదామంటే కుదరదన్నారు. ఇదే సందర్భంగా చంద్రబాబు ప్రమాణస్వీకారంతోనే ప్రజారాజధాని అమరావతికి మళ్లీ ప్రాణప్రతిష్ట జరగబోతోందని, ఆంధ్రుల కలలరాజధాని ప్రపంచస్థాయి నగరంగా, అవకాశాల స్వర్గంగా, సర్వాంగ సుందరంగా అమరావతి రూపుదిద్దుకోబోతోందన్న మాటే ఎంతో సంతోషం కలిగిస్తోందన్నారు. పోలవరం పూర్తి, నదుల అనుసంధానంతో రాష్ట్రమంతా జలసవ్వడులు కూడా త్వరలోనే ఖాయంగా చూస్తామన్నారు. వరికపూడిశెల, పల్నాడు వాటర్ గ్రిడ్ పూర్తి చేసుకునే సదావకాశం వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రజలు అందించిన అద్భుత విజయంతో కేంద్రంలో తెలుగుదేశం పార్టీ, చంద్రబాబు కీలక పాత్ర పోషించే అవకాశం రావడమూ ఈ కలల సాకారానికి ఉపకరించనుందన్నారు. కేంద్రంలో మరోసారి చంద్రబాబు కింగ్‌మేకర్ పాత్ర పోషించనున్నారని, ఈ పాత్రను రాష్ట్రాభివృద్ధికి వినియోగించుకుంటామన్నారు.

## నీరు-చెట్టు బకాయిలు ఐదేళ్లుగా పెండింగ్‌లో పెట్టడం దుర్మార్గం

- ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అన్ని రకాలుగా రైతులను ఆదుకుంటాం : చంద్రబాబునాయుడు
- నీరు-చెట్టు పెండింగ్ బిల్లుల నివేదికను చంద్రబాబుకు సమర్పించిన ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు



ఉండవల్లి (చైతన్యరథం): 2014 నుంచి 2019 వరకు నీరు చెట్టులో అన్ని రకాల అనుమతులతో చేసిన పనులకు సంబంధించి ఏపీ లోని ఉమ్మడి 13 జిల్లాల్లో రైతులు చేసిన పనులకు సంబంధించి వైసీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాలుగా బిల్లులు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టడం దుర్మార్గం అని తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు అన్నారు. నీరు చెట్టు పెండింగ్ బిల్లులపై రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నీరు చెట్టు పెండింగ్ బిల్లుల గ్రీవెన్స్ సెల్ బాధ్యులు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు ఉండవల్లి లోని చంద్రబాబు నాయుడు నివాసం లో ఆయనను కలిసి పూర్తి వివరాలతో నివేదిక సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గత టీడీపీ హయాంలో అన్ని రకాల అనుమతులు ఇచ్చి జీ.వో 187 ద్వారా నీరు చెట్టు పథకంలో చెరువుల పూడికతీత, కాలువల పూడికతీత, చెక్ డ్యామ్‌ల నిర్మాణం, పంట కుంటల నిర్మాణం తదితర నీటి సంరక్షణ పనులను ఉమ్మడి 13 జిల్లాల్లోని రైతులు నీటి సంఘాల ప్రతినిధులు 18,544 పనిదినాలలో పనులను పూర్తి చేశారని తెలిపారు. ఇందుకు రూ.1,303 కోట్లకు సంబంధించిన నిధులు విడుదల చేయకుండా వైసీపీ ప్రభుత్వం రకరకాల మెమోలతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని మండిపడ్డారు.

## జగన్ ముఠా దోచుకున్న రూ.8 లక్షల కోట్లు కక్కిస్తాం

- హెచ్చరించిన టీడీపీ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట (చైతన్యరథం): ఒక్కఛాన్స్ అంటూ వచ్చి అయిదేళ్లలో 8 లక్షల కోట్ల రూపాయలకు పైగా దోచేసిన వైసీపీ దోపిడీ మొత్తాన్ని తిరిగి కక్కిస్తామని మాజీమంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు. ల్యాండ్, శాండ్, వైన్, మైన్, గంజాయి, డ్రగ్స్, ఎర్రచందనం, సహా అనేక రూపాల్లో జగన్ ముఠా ప్రజాధనాన్ని కొల్లగొట్టిందన్నారు. అందుకు సంబంధించి లెక్కలు తేల్చేపని కొత్తప్రభుత్వ కొలువుదీరగానే మొదలవుతుందన్నారు. చిలకలూరిపేట నుంచి అద్భుత విజయం సాధించిన ప్రత్తిపాటికి శుక్రవారం కూడా ప్రజాభిమానం పోటెత్తింది. ఆయనకు అభినందనలు తెలపడానికి తరలివచ్చిన జనసందోహంతో చిలకలూరిపేటలోని ప్రత్తిపాటి నివాస ప్రాంగణం కిటకిటలాడింది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందజేశారు. పూలమాలలు వేసి అభినందనలతో ముంచెత్తారు. మున్సిపల్ కమిషనర్ గోవిందరాజులు, డీఈ రమణ, ఏఈ శ్రీనివాసరావు, మెప్మా ఆర్పీలు, నాదెండ్ల, యడ్లపాడు పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు ప్రత్తిపాటిని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడిన ప్రత్తిపాటి... వైకాపా రూ. 8లక్షల దోపిడీపై ప్రతిపక్షంలోనే ఉండగానే పూర్తి వివరాలతో తెలుగుదేశం పార్టీ తరఫున ఛార్జ్‌షీట్ విడుదల చేశామని గుర్తు చేశారు. జే-బ్రాండ్స్ మద్యం కమీషన్ల రూపంలోనే లక్ష కోట్లకు పైగా దండుకున్నట్లు అనుమానాలు ఉన్నాయని, దానికి సంబంధించి నిగ్గుతేల్చే పని సీఐడీ ద్వారాఇప్పటికే ప్రారంభమైందన్నారు. దాని తర్వాత రూ. లక్ష కోట్ల విలువైన అసైన్డ్ భూముల కుంభకోణం ఉందని, దానిలో వైకాపా నేతల నుంచి కొంతమంది సీనియర్ అధికారుల పాత్రపైనా విచారణలు తప్పవన్నారు. జగన్ బినామీ సంస్థ ఇండోసోల్ కుంభకోణం, విద్యుత్ ఒప్పందాలు, టీడీఆర్ బాండ్లలో గోల్‌మాల్ ద్వారా కూడా వేల కోట్లు దోచేశారని ఆయన ఆరోపించారు. విశాఖభూముల కుంభకోణం మరో రూ.40వేల కోట్ల వరకు లెక్క తేలుతోందన్నారు. వీటన్నింటిలో ప్రమేయం ఉన్న వైకాపా నాయకులు, అధికా రులు తప్పక చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు.

## జగన్‌రెడ్డి భక్త అధికారులకు రిటర్న్ గిఫ్ట్ గ్యారెంటీ

- గుంటూరు సిఐడి ప్రాంతీయ కార్యాలయం వద్ద తెలుగుయువత నేతల సంబరాలు
- అధికారులకు మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపిన రావిపాటి సాయికృష్ణ






గుంటూరు (చైతన్యరథం): అధికార దురహంకారంతో నియంత జగన్‌రెడ్డికి తాబేదార్లుగా వ్యవహరించిన అధికారులకు శంకరగిరిమాన్యాలు తథ్యమని గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ అన్నారు. శుక్రవారం గుంటూరులోని సిఐడి ప్రాంతీయ కార్యాలయంలో గుంటూరు జిల్లా తెలుగు యువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ ఆధ్వర్యంలో సిఐడి బాధితులతో కలిసి కేక్ కోసి భారీగా బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. అనంతరం కార్యాలయం వెలుపల ఉన్న అధికారులకు మిఠాయిలు పంచిపెట్టారు.

తెలుగుయువత నేతలు వస్తున్నారన్న సమాచారాన్ని తెలుసుకొని కొంతమంది అధికారులు అక్కడి నుంచి ముందుగానే బయటకు వెళ్లిపోయారు. గడచిన ఐదేళ్లలో ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు, మీడియా సంస్థల యాజ మాన్యాలను సైతం సిఐడి పేరుతో అక్రమ కేసులతో మానసిక వేధింపులకు గురిచేసి ఇష్టారాజ్యంగా కొందరు అధికారులు స్వామి భక్తి ప్రదర్శించారని, టీడీపీ కార్యకర్తలను మనోవేదన గురిచేసి వైసీపీ పట్ల తమ స్వామిభక్తిని ప్రదర్శించుకున్న వారికి భవిష్యత్తులో రిటర్న్ గిఫ్ట్ ఇచ్చేందుకు మా నాయకులు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

ఈ కార్యక్రమంలో సిఐడి కేసు బాధితులు చేరెడ్డి జనార్దన్, షేక్ ఫిరోజ్, మంచోడు మణి, కరణం ప్రభాకర్, అభిరామ్‌లతో పాటు టీడీపీ వాణిజ్యవిభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు వలివేటి కృష్ణ, పశ్చిమ అధక్షులు తల్లం శేఖర్, తెలుగుయువత నాయకులు చెరుకుపల్లి నాగరాజు, గుత్తికొండ కిరణ్ యాదవ్, మన్నెం శ్రీనివాసరావు, ఈదర త్రినాథ్, క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షులు కురంగి అనిల్, కొమ్మినేని కోటేశ్వరరావు, శ్రీపతి రాంబాబు, చిక్కాలశివ, బుల్లా కుమార్ బాబు, శేషాద్రి సాంబశివరావు, శొంఠినేని అనిల్, క్షత్రి పూర్ణ సింగ్, చిరుమామిళ్ల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన మాట ప్రకారం కట్టుబడి ఉంటా..!

- ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు



మండపేట (చైతన్యరథం): ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం త్వరలోనే టిడ్కో కు మహర్దశ పట్టిస్తానని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. ఆయన ఓ నిజమైన ప్రజా ప్రతి నిధి... ప్రజా సమస్యలు పట్ల ఎలా వ్యవహరించాలో అలాగే స్పందించారు. ఓ పక్క ఎన్నికల్లో ఘన విజయంతో నియోజకవర్గం నలుమూలల నుండి ప్రజలు, అభిమానులు, వివిధ శాఖల ఉద్యోగులు వేలాదిగా తరలి వచ్చి అభినందనలతో ముంచెత్తుతుంటే ఆయన అవన్నీ పక్కన పెట్టి ఎన్నికల ప్రచారంలో తాను ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టారు. పార్టీ కార్యాలయం వద్ద చుట్టుముట్టిన అభిమానుల నుండి తప్పించుకుని నడుచుకుంటూ కొంత దూరం వెళ్ళి అక్కడి నుండి కారులో నేరుగా గొల్లపుంత చేరుకున్నారు. అక్కడి టిడ్కో ఇళ్లను అధికారులతో కలిసి పరిశీలించారు. డ్రైనేజ్ మురుగు నీరు తో పాటు సెప్టిక్ ట్యాంక్ కూడా నుండి పోయి వ్యర్థాలు బయటకు వచ్చి అస్తవ్యస్తంగా వున్న పరిసరాలను ఆయన పరిశీలించారు. ఐదేళ్లుగా వైసిపి నాయకులు టిడ్కో ఇళ్లను పూర్తి గా విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. సెప్టిక్ ట్యాంక్ కు సంబంధించి పనులు నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతి బ్లాక్ ను డ్రెన్ కంటే రెండు మూడు అంగుళాల ఎత్తు పెంచాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. అత్యవసర పనులపై మున్సిపల్ నిధులు నుండి ఖర్చు చేసేందుకు మీ రోజు వారి ఖర్చు లిమిట్ అంత అని అక్కడే వున్న కమీషనర్ ను ప్రశ్నించారు. ఆయన 50 వేలు అని చెప్పడంతో వెంటనే సంబంధిత పనులను ప్రారంభించాలని సూచించారు. ఈ పనులన్నీ చైర్ పర్సన్ రాణి దృష్టిలో వుంచి చేయాలనీ, ఆమెకు తగిన గౌరవం ఇవ్వాలని సూచించారు. ఒకవేళ ఆమె చేయవద్దు అంటే మాత్రం తనకు చెప్పాలని ఆ పనులు ఎలా పూర్తి చేయాలో తాను చూసుకుంటానని తెలిపారు. ప్రాధాన్యత క్రమంలో అక్కడి సమస్యలు అన్నింటినీ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నెల రోజుల్లో అక్కడి రూపు రేఖలు పూర్తిగా మారిపోవాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం త్వరలోనే టిడ్కో కు మహర్దశ పట్టిస్తానని చెప్పారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన ప్రతి హామికి కట్టుబడి ఉన్నానని వీలైనంత త్వరలో అన్నింటినీ పూర్తి చేస్తానని చెప్పారు.

## అద్వానీ, రామ్‌నాథ్ కోవింద్, జోషిల నుంచి
# ఆశీర్వాదం తీసుకున్న మోదీ




**న్యూఢిల్లీ :** నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్' పార్టీల పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా నరేంద్ర మోదీని భాగస్వామ్య పక్షాలు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయి. భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిశారు. ఢిల్లీలోని రామ్‌నాథ్ కోవింద్ నివాసానికి వెళ్లిన ప్రధాని.. ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చారు. అనంతరం కోవింద్ కూడా ప్రధానికి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి రామ్‌నాథ్ కోవింద్ మిఠాయి తినిపించారు. ఆ తర్వాత రామ్‌నాథ్ కోవింద్ కుటుంబసభ్యులతో ప్రధాని కాసేపు ముచ్చటించారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరారు.

అంతకుముందు పార్లమెంట్ సెంట్రల్ హాల్ నుంచి బయలుదేరగానే ప్రధాని మోదీ నేరుగా అనంతరం మోదీ.. బీజేపీ సీనియర్ నేత, భారతరత్న ఎల్ కె అద్వానీ నివాసానికి వెళ్లారు. ఆయన వద్ద ఆశీర్వాదం తీసుకున్నారు. వరుసగా మూడోసారి ప్రధాని పదవి చేపట్టబోతున్నందుకు మోదీకి అద్వానీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురూ కాసేపు మాట్లాడుకున్నారు. మరోవైపు దేశానికి అద్వానీ అందించిన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఇటీవలే భారతరత్నతో సత్కరించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అద్వానీ విశ్రాంత జీవితాన్ని గడుపుతున్నారు. ఆ తర్వాత కేంద్ర మాజీ మంత్రి మురలీ మనోహర్ జోషి నివాసానికి మోదీ వెళ్లారు. అక్కడ ఆయన నుంచి ఆశీర్వాదాన్ని అందుకున్నారు.

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 240 స్థానాలను కైవసం చేసుకుంది. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు టీడీపీ, జేడీయూ, లోక్ జనశక్తి రామ్ విలాస్ పాశ్వాన్, శివసేన షిండే మద్దతుతో మోదీ ప్రభుత్వాన్ని రెండు మూడు రోజుల్లో కొలువు తీరనుంది. మరోవైపు జూన్ 9వ తేదీ సాయంత్రం 6.00 గంటలకు ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

## కొందరు ఓట్లు, మరికొందరు చెంప దెబ్బలు ఇస్తారు..
### - కంగనాను కొట్టడంపై సంజయ్ రౌత్

ముంబై: నటి నుంచి రాజకీయ నాయకురాలిగా మారిన కంగనా రనౌత్‌ను సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ చెంపపై కొట్టడంపై మహారాష్ట్రకు చెందిన శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ స్పందించారు. 'కొందరు ఓట్లు, కొందరు చెంప దెబ్బలు' ఇస్తారని వ్యాఖ్యానించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని మండి నియోజకవర్గంలో బీజేపీ ఎంపీగా గెలిచిన కంగనాను గురువారం చండీగఢ్ విమానాశ్రయంలో సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ చెంపపై కొట్టింది. సంజయ్ రౌత్ దీనిపై శుక్రవారం స్పందించారు. 'కొందరు ఓట్లు ఇస్తారు, మరికొందరు చెంప దెబ్బలు ఇస్తారు. అసలేం జరిగిందో నాకు తెలియదు. తన అమ్మ కూడా కూర్చున్నదని లేడీ కానిస్టేబుల్ చెప్పిందంటే నిజమే. రైతు ఆందోళనలో ఆమె తల్లి ఉంది, ఎవరైనా వ్యతిరేకంగా ఏదైనా మాట్లాడినట్లయితే, అది కోపాన్ని కలిగిస్తుంది' అని మీడియాతో అన్నారు.
కాగా, కంగనాపై దాడిని సంజయ్ రౌత్ ఖండించారు. ప్రధాని మోదీ చట్టబద్ధమైన పాలన ఉండాలని చెబితే దానిని చేతుల్లోకి తీసుకోకూడదని తెలిపారు. 'రైతుల ఆందోళనలో పాల్గొన్న ప్రజలు భారతదేశ కుమారులు, కుమార్తెలు. ఎవరైనా భారత మాతను అవమానిస్తే, ఎవరైనా బాధపడితే, అది ఆలోచించాల్సిన విషయమే. కంగనా పట్ల నాకు సానుభూతి ఉంది. ఆమె ఇప్పుడు ఎంపీ. ఎంపీపై దాడి చేయకూడదు. రైతులను కూడా గౌరవించాలి' అని అన్నారు.




## పార్లమెంట్‌కు ప్రియాంక పోటీ



**ఢిల్లీ :** ప్రియాంక గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఎప్పుడొస్తారా అని కాంగ్రెస్ శ్రేణులు ఎదురు చూస్తున్నాయి. పోటీ చేయాలని చాలా సందర్భాల్లో కోరారు. వివిధ కారణాలతో దూరం అయ్యారు. ఈ సారి మాత్రం లోక్ సభకు ప్రియాంక గాంధీ పోటీ చేసే అవకాశం ఉంది. సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ గాంధీ వాయనాడుతోపాటు రాయ్ బరేలి నుంచి కూడా బరిలోకి దిగారు. రెండు చోట్ల గెలవడంతో ఒక స్థానానికి రాజీనామా చేస్తారు. రాజీనామా చేసే స్థానం వాయనాడు అని కాంగ్రెస్ వర్గాలు సూత్రప్రాయంగా వెల్లడించాయి. వాయనాడు ఉప ఎన్నికలో ప్రియాంక గాంధీ బరిలోకి దిగే అవకాశం ఉంది. ఈ విషయంపై కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. లోక్ సభ ఎన్నికల్లో ప్రియాంక అన్నీ తానై వ్యవహరించారు. సోదరుడు రాహుల్ గాంధీతో జోరుగా ప్రచారం నిర్వహించారు. అమేథి, రాయ్ బరేలి, వాయనాడులో ఉధృతంగా ప్రచారం చేశారు. గత ఎన్నికల కన్నా కాంగ్రెస్ పార్టీ సీట్లు పెరగడంలో ప్రియాంక గాంధీ ముఖ్య పాత్ర పోషించారు. పరిస్థితులు అనుకూలించి వాయనాడు నుంచి ప్రియాంక గాంధీ పోటీ చేసి, గెలిస్తే కాంగ్రెస్ పార్టీ సీట్లు 100కు చేరుకుంటాయి. పదేళ్ల తర్వాత ఆ పార్టీ సీట్ల సంఖ్య మూడంకెలకు చేరబోతుంది. ఏం జరగనుందో చూడాలి మరి.

## విమానాశ్రయంలో 9 కిలోల బంగారం పట్టివేత



**బెంగళూరు :** బెంగళూరులోని విమానాశ్రయాల్లో రెండు వేర్వేరు ఘటనల్లో కస్టమ్స్ అధికారులు 9 కిలోల బంగారాన్ని పట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం ఉదయం 6.29 కోట్ల విలువైన 9 కిలోల బంగారాన్ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ)స్వాధీనం చేసుకున్నట్లుగా గురువారం అధికారులు వెల్లడించారు. బ్యాంకాక్ నుంచి బెంగళూర్ వస్తున్న విమానంలో అక్రమంగా బంగారాన్ని తరలిస్తున్నట్లుగా అధికారులకు సమాచారం అందింది. దీంతో వారు అప్రమత్తమై బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగిన థాయ్ ఎయిర్‌వేస్ విమానంలో తనిఖీలు నిర్వహించారు. విమానంలోని ఓ మూలలో దాచిన ఓ హ్యాండ్ బ్యాగులో రూ.4.77 కోట్ల విలువైన 6.834 కిలోల బంగారు బిస్కెట్లను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బ్యాగ్ లోపల ఉన్న ఆధారాల ద్వారా దానిని విమానంలో వదిలివేసిన ఇద్దరు ప్రయాణికులను అదుపులోకి తీసుకున్నారు. ఈ విచారణలో భాగంగా బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లుగా వారు అంగీకరించారన్నారు. మరో ఘటనలో బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో దుబాయ్ నుంచి వచ్చిన ఎమిరేట్స్ విమానంలో రూ.1. 52 కోట్ల విలువైన 2.18 కిలోల బంగారాన్ని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనిని విమానం ముందు భాగంలోని లావేటరీలో దాచి తరలిస్తున్నారని అధికారులు తెలిపారు.

# ఎంపీ జీతమెంతో తెలుసా?



**ఢిల్లీ:** ఎట్టకేలకు లోక్ సభ ఎన్నికలు పూర్తయ్యాయి. కేంద్రంలో కొత్త సర్కార్ కొలువుదీరబోతోంది. రాష్ట్రాల్లో ఎంపీలుగా ఎన్నికైన వారే కేంద్రంలో సర్కార్‌ని ఎన్నుకుంటారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి 293 సీట్లు రాగా, ఇండియా కూటమికి 232 సీట్లు వచ్చాయి. అయితే ఎంపీల జీతం ఎంతుంటుందోనని ఎప్పుడైనా ఆలోచించారా. ఇప్పుడు తెలుసుకుందాం.

**ఎంపీ జీతాలు..**
ఎంపీ నెలకు రూ.1లక్ష జీతం పొందుతారు. 2018లో వీరి వేతనాన్ని పెంచారు.

**అలవెన్సులు, ప్రోత్సాహకాలు..**
ఎంపీలు నియోజకవర్గ భత్యం రూపంలో నెలకు రూ.70,000 అందుకుంటారు.

**కార్యాలయ ఖర్చులు**
ఒక పార్లమెంటు సభ్యుడు ఎంపీ కార్యాలయ ఖర్చుల కోసం నెలకు రూ.60,000 అందుకుంటారు. ఇందులో స్టేషనరీ సామగ్రి సిబ్బంది జీతాలు మొదలైనవి ఉంటాయి.

**రోజువారీ భత్యం**
పార్లమెంటరీ సెషన్‌లు, కమిటీ సమావేశాల సమయంలో ఎంపీలు బస చేయడానికి, వారి ఆహార ఖర్చుల కోసం రోజుకు రూ.2,000 భత్యం ఇస్తారు.

**ప్రయాణ భత్యం**
ఏడాదిలో 34 సార్లు ఎంపీతో పాటు ఆయన భార్యకు ఉచిత విమాన ప్రయాణం కల్పిస్తారు. అధికారిక, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉచిత ఫస్ట్-క్లాస్ రైలు ప్రయాణం కూడా చేయొచ్చు. ఎంపీలు తమ నియోజకవర్గాల పరిధిలో రోడ్డు మార్గంలో ప్రయాణించేటప్పుడు మైలేజ్ అలవెన్సులను కూడా అందుకోవచ్చు.

**హౌసింగ్, వసతి**
ఎంపీలకు 5 సంవత్సరాల పదవీకాలంలో ప్రధాన ప్రాంతాల్లో అద్దె రహిత వసతి ఇస్తారు. సీనియారిటీని బట్టి బంగ్లాలు, ఫ్లాట్లు, హాస్టల్ గదుల్లో ఫ్రీగా ఉండొచ్చు. అధికారిక వసతి వద్దనుకున్న వారు నెలకు రూ.2,00,000 గృహ భత్యాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చు.

**వైద్య సదుపాయాలు**
ఎంపీలు, వారి కుటుంబ సభ్యులు కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్) కింద ఉచిత వైద్య సంరక్షణకు అర్హులు. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్స , పథకం కింద వచ్చే ప్రైవేట్ ఆసుపత్రులూ ఉంటాయి.

**పింఛన్..**
పదవి కోల్పోయిన అనంతరం రూ.50 వేల పింఛన్ సైతం వస్తుంది. ప్రతి ఏడాది నెలకు రూ.2,000 ఇంక్రిమెంట్ పొందుతారు.

**ఫోన్, ఇంటర్నెట్**
మూడు టెలిఫోన్లను ఉపయోగించుకోవచ్చు. వాటిని ఇష్టమైన చోట ఏర్పాటు చేసుకోవచ్చు.ఎంపీలకు సంవత్సరానికి 1,50,000 టెలిఫోన్ కాల్‌లు ఫ్రీ. వారు తమ నివాసాలు, కార్యాలయాలలో ఉచిత హై-స్పీడ్ ఇంటర్నెట్ కనెక్షన్‌లను కూడా ఉపయోగించుకోవచ్చు.

**నీరు, విద్యుత్**
ఎంపీలకు ఏటా 50,000 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 4,000 కిలోలీటర్ల వరకు ఉచిత నీరు అందిస్తారు.

# అంతరిక్ష కేంద్రంలో ఫుల్ ఖుషీగా సునీత విలియమ్స్ డ్యాన్స్

భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం చేరుకున్నారు. ఆమెతో పాటు మరో వ్యోమగామి బుచ్ విల్మోర్లు సైతం ప్రయాణించిన బోయింగ్ స్టార్లైనర్ వ్యోమనౌక గురువారం విజయవంతంగా ఐఎస్ఎస్కు అనుసంధానమైంది. ఈ సందర్భంగా వ్యోమగాములకు అక్కడ ఘన స్వాగతం లభించింది. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న సంప్రదాయం ప్రకారం.. గంటకొట్టి వారిని ఆహ్వానించారు.

ఐఎస్ఎస్కు చేరుకున్న సునీత డ్యాన్స్ చేసి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న మరో ఏడుగురు వ్యోమగాములను ఆలింగనం చేసుకొని తన సంతోషాన్ని వ్యక్తపర్చారు. దీనికి సంబంధించిన వీడియోను బోయింగ్ స్పేస్ తన ఎక్స్ ఖాతాలో పంచుకోగా ప్రస్తుతం అది వైరలవుతోంది. ఐఎస్ఎస్లో భారరహిత స్థితి ఉంటుందనే విషయం తెలిసిందే. ఆ పరిస్థితుల్లో సునీత చేసిన డ్యాన్స్ అందరినీ ఆకట్టుకుంటోంది. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఐఎస్ఎస్లో ఉన్న వారంతా తన కుటుంబ సభ్యుల్లాంటి వారని పేర్కొన్నారు. వారిని కలిసిన సందర్భంగా తాను ఆ విధంగా వేడుక చేసుకున్నానని తెలిపారు.

బోయింగ్ సంస్థ రూపొందించిన స్టార్లైనర్కు ఇది తొలి మానవసహిత యాత్ర. అంతకుముందు హీలియం లీకేజీ కారణంగా వ్యోమనౌకలోని గైడెన్స్-కంట్రోల్ థ్రస్టర్లలో ఇబ్బందులు తలెత్తాయి. ఫలితంగా గంట ఆలస్యమైనప్పటికీ.. ఐఎస్ఎస్తో అనుసంధానం కాగలిగింది. ఐఎస్ఎస్కు చేరే క్రమంలో వ్యోమనౌకలోని నియంత్రణ వ్యవస్థలను సునీత, విల్మోర్లు కొద్దిసేపు పరీక్షించారు. మార్గమధ్యంలోనూ ఈ క్యాప్సూల్ను హీలియం లీకేజీ సమస్య వేధించింది. అయితే దీనివల్ల వ్యోమగాములకు ఎలాంటి ఇబ్బంది లేదని బోయింగ్ ప్రతినిధి తెలిపారు. వ్యోమనౌకలో పుష్కలంగా హీలియం నిల్వలు ఉన్నాయని చెప్పారు.

భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ ఇది మూడో రోదసీ యాత్ర. గతంలో ఆమె 2006, 2012లో ఐఎస్ఎస్కు వెళ్లారు. మొత్తం 50 గంటల 40 నిమిషాల పాటు స్పేస్వాక్ నిర్వహించారు. 322 రోజులపాటు అంతరిక్షంలో గడిపారు. ఆమె ఒక మారథాన్ రన్నర్. ఐఎస్ఎస్లో ఓసారి మారథాన్ కూడా చేశారు. మునుపటి అంతరిక్ష యాత్రలో ఆమె భగవద్గీతను వెంట తీసుకెళ్లారు. ఈసారి గణేశుడి విగ్రహాన్ని తీసుకెళ్తున్నట్లు ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.



## భారత్లో కేజ్రీవాల్కు బెయిల్.. పాక్లో నాకు మాత్రం రాలేదు

**- ఇమ్రాన్ ఖాన్ వ్యాఖ్య**





ఓ కేసులో పాకిస్థాన్ సుప్రీంకోర్టు ముందు హాజరైన ఆ దేశ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ .. ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజీవాల్ ప్రస్తావన తీసుకురావడం చర్చనీయాంశంగా మారింది. భారత్లో లోక్సభ ఎన్నికల వేళ ప్రచారం కోసం కేజీవాల్కు బెయిల్ దక్కింది. కానీ, ఇక్కడ తాను మాత్రం రాజకీయ అణచివేతకు గురవుతున్నానని, జైల్లో తనపై దారుణ వ్యవహార శైలి ఉందని పేర్కొన్నారు.

'నేషనల్ అకౌంటబిలిటీ ఆర్డినెన్స్'లో సవరణలకు సంబంధించిన కేసులో సీజేపీ జస్టిస్ ఖాజీ ఫయీజ్ ఇసా నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం ముందు ఇమ్రాన్ ఖాన్ విచారణకు హాజరయ్యారు. 2022లో అధికారం కోల్పోయినప్పటినుంచి తనకు ఎదురైన పరిస్థితులను ఆయన ఏకరవు పెట్టారు. ఈ ఏడాది ఫిబ్రవరి 8న జరిగిన పాకిస్థాన్ సార్వత్రిక ఎన్నికలకు తనను దూరం పెట్టేందుకుగానూ ఐదు రోజుల్లోనే ఓ కేసులో దోషిగా తేల్చారన్నారు. భారత్లో ఎన్నికల ప్రచారం కోసం కేజీవాలకు అక్కడి సుప్రీంకోర్టు బెయిల్ మంజూరుచేసిందని, తాను మాత్రం ఇక్కడ అప్రకటిత 'మార్షల్ లా' కింద అణచివేతను ఎదుర్కొంటున్నానని వాపోయారు.

ప్రస్తుత కేసు విచారణను ప్రత్యక్ష ప్రసారం చేయాలని కోరుతూ ఖైబర్ పునాఖ్వా ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని తిరస్కరిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపైనా ఇమ్రాన్ నిరాశ వ్యక్తంచేశారు. "కోర్టులో రాజకీయాలు మాట్లాడానని తీర్పులో పేర్కొన్నారు. అసలు.. నేనేం మాట్లాడాను? " అని అడిగారు.

ఈ క్రమంలోనే సీజేపీ జోక్యం చేసుకుని.. తీర్పుపై న్యాయమూర్తులు ఎవరికీ వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదని, దీనిపై రివ్యూ పిటిషన్ వేయొచ్చని సూచించారు. కోర్టులో పెండింగ్లో ఉన్న అంశాల గురించి మాత్రమే మాట్లాడాలని చురకలంటించారు.

ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అరెస్టైన కేజీవాలకు సుప్రీంకోర్టు ఇటీవల మధ్యంతర బెయిల్ ఇచ్చిన విషయం తెలిసిందే. లోక్సభ ఎన్నికల్లో ప్రచారం నిర్వహించుకు నేందుకు వీలుగా సర్వోన్నత న్యాయస్థానం దీన్ని మంజూరుచేసింది. బెయిల్ గడువు ముగియడంతో.. కేజీవాల్ ఈనెల 2న తిరిగి జైలుకు చేరారు.

## మోదీ ప్రమాణ స్వీకారోత్సవానికి మాల్దీవుల అధ్యక్షుడు

నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారోత్సవానికి మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు హాజరుకానున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు భారత్ ఆహ్వానాన్ని ముయిజ్జు స్వీకరించినట్లు అక్కడి మీడియా వెల్లడించింది. ఎన్డీయే కూటమి తరపున లోక్సభాపక్ష నేతగా ఎన్నికైన మోదీ జూన్ 9న (ఆదివారం) ఢిల్లీలో ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈనేపథ్యంలో ముయిజ్జు శనివారమే దిల్లీ చేరుకుంటారని అక్కడి మీడియా పేర్కొంది. అయితే, భారత్ పర్యటనపై మాల్దీవుల అధ్యక్ష భవనం ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

మరోవైపు ఎన్డీయే కూటమి విజయం సాధించిన నేపథ్యంలో మోదీని.. ఎక్స్ వేదికగా బుధవారం ముయిజ్జు అభినందించారు. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టబోతుండటం సంతోషంగా ఉందన్నారు. శ్రేయస్సు, స్థిరత్వాన్ని దృష్టిలో పెట్టుకొని ఇరుదేశాలకు ప్రయోజనం కలిగేలా కలిసి పని చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఒకవేళ ముయిజ్జు భారత్కు వస్తే.. అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత మన దేశంలో ఆయన తొలి అధికారిక పర్యటన ఇదే.

గతేడాది నవంబర్ 17న మాల్దీవుల అధ్యక్షుడిగా ఎన్నికైన ముయిజ్జు.. చైనా అనుకూల విధానాలను అవలంబిస్తూ.. భారత్తో అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన గంటల వ్యవధిలోనే భారత్ బలగాలు మాల్దీవులను విడిచి వెళ్లిపోవాలని షరతు విధించారు. ఈమేరకు మే 10 నాటికి మొత్తం 88 మంది ఆర్మీ సిబ్బంది అక్కడినుంచి వచ్చేశారు.



మరోవైపు మాల్దీవుల్లో చేపడుతున్న పరిశ్రమలు, నిర్మాణ ప్రాజెక్టుల కోసం ముయిజ్జు చైనా వైపే మొగ్గు చూపుతున్నారు.

కాగా, మోదీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి పొరుగుదేశాలైన బంగ్లాదేశ్, శ్రీలంక, భూటాన్, నేపాల్, మారిషస్ తదితర దేశాధినేతలు హాజరయ్యే అవకాశముంది. ఈ మేరకు అధికారులు వారికి ఆహ్వానాలు పంపించినట్లు సమాచారం.

## అమెరికాకు రష్యా వార్నింగ్

**- మేమూ ఆయుధాలు పంపిస్తాం..**



రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వార్నింగ్ ఇచ్చారు. పశ్చిమ దేశాలను టార్గెట్ చేయాలనుకుంటున్న దేశాలకు ఆయుధాలు సరఫరా చేయనున్నట్లు ఆయన చెప్పారు. పశ్చిమ దేశాలు ఉక్రెయిన్కు ఆయుధాలు ఇవ్వడాన్ని ఆయన తప్పుపట్టారు. సుదీర్ఘ దూరం ప్రయాణించే ఆయుధాలను ఉక్రెయిన్కు సరఫరా చేస్తున్న అమెరికాను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యాపై దాడికి ఆయుధాలు ఇవ్వడం వల్ల సమస్యలు తీవ్రతరం అవుతాయన్నారు పుతిన్. వార్ జోన్ కు ఆయుధాలు పంపడం వీలవుతుందని అనుకున్నప్పుడు.. అలాగే తాము కూడా సున్నితమైన దేశాలకు ఆయుధాలను సరఫరా చేస్తామని పుతిన్ అన్నారు. పశ్చిమ దేశాలు ఆయుధాలు సరఫరా చేస్తే.. ఆ దేశాలను టార్గెట్ చేయాలనుకుంటున్న ఇతర దేశాలకు తాము కూడా ఆయుధాలను ఇవ్వనున్నట్లు చెప్పారు. ఏ దేశాలకు ఆయుధాలను ఇచ్చేందుకు ఆసక్తిగా ఉన్న విషయాన్ని పుతిన్ వెల్లడించలేదు.

## క్షమాపణలు కోరిన బ్రిటన్ ప్రధాని



బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ క్షమాపణలు కోరారు. డీ డే సంబరాల నుంచి అర్ధాంతరంగా వెళ్లిపోయినందుకు సారీ చెప్పారు. తప్పు జరిగినట్లు ఆయన అంగీకరించారు. ఫ్రాన్స్లోని నార్మాండీలో జరుగుతున్న డీ డే సెలబ్రేషన్లో పాల్గొనేందుకు వెళ్లిన రిషి సునాక్.. అకస్మాత్తుగా ఆ కార్యక్రమంలో పాల్గొనకుండానే మళ్లీ స్వదేశానికి పయనం అయ్యారు. అయితే ఓ టీవీకి ఇంటర్వ్యూ ఇచ్చిన ఆయనపై విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రిషి సునాక్ క్షమాపణలు కోరారు.

## రష్యాలో ఘోర ప్రమాదం..

**నదిలో మునిగి నలుగురు భారత వైద్య విద్యార్థులు మృతి**

రష్యాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. సెయింట్ పీటర్స్ బర్గ్ ప్రాంతంలోని ఓ నదిలో నలుగురు భారతీయ వైద్య విద్యార్థులు కొట్టుకు పోయారు. వీరిలో ఒకరి మృతదేహాన్ని రెస్క్యూ సిబ్బంది వెలికితీయగా.. మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు.

సెయింట్ పీటర్స్బర్గ్లోని యరోస్లోవ్ ది వైస్ నోవోగారోడ్ స్టేట్ యూనివర్సిటీలో చదువుతున్న కొందరు విద్యార్థులు జూన్ 5న తమకు సమీపంలోని వోలోవ్ నది ఒడ్డున వాకింగ్కు వెళ్లారు. వారు నడుస్తుం డగా ఓ విద్యార్థిని ప్రమాదవశాత్తూ నీటిలోకి జారిపడింది. ఆమెను కాపాడేందుకు నలుగురు విద్యార్థులు నదిలోకి దిగారు. ఈ ప్రయత్నంలో ముగ్గురు కొట్టుకుపోగా.. ఓ అమ్మాయిని స్థానికులు కాపాడారు.

సమాచారమందుకున్న స్థానిక పోలీసులు, రెస్క్యూ సిబ్బంది తక్షణమే అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఇందులో ఓ విద్యార్థి మృతదేహాన్ని గుర్తించగా.. మిగతా మృతదేహాల కోసం గాలిస్తున్నారు.




మృతులను హర్షల్ అనంత్రెవ్, జీషన్ పింజారీ, జియా పింజారీ, మాలిక్ మహమ్మద్ యాకూబ్ గుర్తించారు. వీరిలో జీషన్, జియా, హర్షలే మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లా.

ఆ జిల్లా కలెక్టర్ ఆయుష్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల మృతిని ధ్రువీకరించారు. వారి మృతదేహాలను భారత్కు తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రమాదంపై సెయింట్ పీటర్స్ బర్గ్ లోని భారత దౌత్యకార్యాలయం స్పందించింది. ఇది దురదృష్టకర ఘటన అని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా సాయం అందిస్తామని తెలిపింది.



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



12న చంద్రబాబు

## ప్రమాణ స్వీకారం

**సమయం: ఉదయం 11.27 గంటలు**

**వేదిక: కేసరపల్లి ఐటీ పార్క్**

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఈనెల 12వ తేదీ ఉదయం 11.27 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రధాని నరేంద్రమోదీ, ఎన్డీయే కూటమి ముఖ్యనేతలు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ కార్యక్రమానికి వచ్చే అవకాశం ఉన్నందున...తొలుత మంగళగిరి ఎయిమ్స్ సమీపంలోని స్థలాన్ని పరిశీలించారు. ఆ ప్రాంతం అనువుగా లేకపోవడంతో గన్నవరంలో మరో ప్రాంతాన్ని పరిశీలించారు. చివరికి గన్నవరం విమానాశ్రయం సమీపంలోని కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద ప్రమాణస్వీకార కార్యక్రమం ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. సభావేదిక నిర్మాణం కోసం ఇప్పటికే 12 లారీలలో సామగ్రిని తీసుకొచ్చారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్, తదితరులు సభా స్థలాన్ని పరిశీలించారు.

వైసీపీ కవ్వింపు చర్యలపై..

## సంయమనం పాటించాలి

*టీడీపీ నాయకులు, శ్రేణులకు చంద్రబాబు పిలుపు*

అమరావతి: రాష్ట్రంలో ఎన్నికల ఫలితాల అనంతరం అక్కడక్కడా జరుగుతున్న వైసీపీ కవ్వింపు చర్యలు, దాడులపై టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. కొన్ని చోట్ల వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు, ఘర్షణల విషయంపై పార్టీ నేతల ద్వారా సమాచారం తెప్పించుకున్నారు. వైసీపీ కవ్వింపు చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని టీడీపీ శ్రేణులకు చంద్రబాబు సూచించారు. నాయకులు సైతం అప్రమత్తంగా ఉండి.. దాడులు, ప్రతి దాడులు జరగకుండా చూడాలని పార్టీ ఆదేశించారు. ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షించాలన్నారు. వైసీపీ కార్యకర్తలు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడినా పూర్తి సంయమనం పాటించాలన్నారు. పోలీసు అధికారులు సైతం శాంతి భద్రతలు అదుపులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ఎన్డీయే అంటే అభివృద్ధి, సుపరిపాలన

- దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకెళ్తాం
- రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను గెలిపించినా త్వరగా ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారు
- మద్దతుగా నిలిచిన ఎన్డీయే సభ్యులకు ధన్యవాదాలు
- ఎన్డీయేకు దేశప్రయోజనాలే ప్రధానం
- ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మోదీ ఉద్ఘాటన

2



## ఎన్డీయే పక్షనేతగా మోదీ ఏకగ్రీవం

- ప్రతిపాదించిన రాజ్‌నాథ్ సింగ్
- బలపరిచిన చంద్రబాబు, ఇతర నేతలు
- రాష్ట్రపతిని కలిసి సమావేశ తీర్మానం అందజేత
- 9న ప్రమాణ స్వీకారం చేస్తామని తెలిపిన నేతలు
- ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించిన రాష్ట్రపతి

- పూర్తి కథనం 3లో..

## పొలిటికల్ పెన్‌కౌంటర్



రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థలు కుప్ప కూలాయి. వైసీపీ నేతలపై ఉన్మాదంతో దాడులు చేస్తున్నారు. ఐదేళ్లలో మేం తెచ్చిన సంస్కరణలు మూడు రోజుల్లోనే మాయమయ్యాయి. దీనిపై గవర్నర్ జోక్యం చేసుకోవాలి: జగన్ ట్వీట్

*వల్లించకు వేదాలు*
*ఓడినట్టి దెయ్యాలు..!*
*ఇన్నాళ్లకు గుర్తొచ్చెన*
*జలగన్నకు వ్యవస్థలు!!*

*ఐదేళ్లుగ సాగెకదా..*
*ఆటవికపు నీ రాజ్యం!*
*వ్యవస్థలన్ని కునారిల్లె*
*రాష్ట్రమంత నిర్వీర్యం!!*

*ఉద్రేకం.. ఉన్మాదం*
*మీవి కదా మీటెంటు!*
*అది చూసే లేపినారు*
*ప్రజలంతా మీ టెంటు!?*

*పాలనలు, సంస్కరణలు*
*పెద్దమాటలేల జగన!*
*నెత్తి నోరు మొత్తుకున్న*
*నమ్మగలర నీ నటన!!*

-మహాదేవ

మూడక్షరాల

# గుండెధైర్యం!

- వైసీపీ పీడితులకు అండగా నిలిచిన లోకేష్
- యువత, మహిళలకు అతనో చైతన్య ఊపిరి..
- 'మిషన్ రాయలసీమ'తో బలమైన అడుగులు
- లోకేష్ ప్రతి అడుగూ.. కూటమికి బలమైంది

*ఎవరో ఒకరు ఎపుడోకపుడ నడవరా ముందుకు అటో ఇటో ఎటోవైపు - అన్నాడు అంకురం చిత్రం కోసం సిరివెన్నెల సీతారామశాస్త్రి. బహుశ, యువనేత లోకేష్‌లాంటి రియల్ క్యారెక్టరేదో సీతారామశాస్త్రి కంట పడుండాలి. గద్దెనెక్కిన జగన్ సాగిస్తోన్న విధ్వంస పాలనను రాష్ట్రమంతా మౌనంగా భరిస్తున్న సమయంలో - ఉద్యమ బాటపట్టి తొలి అడుగేసింది నారా లోకేష్. జగన్ అరాచకాన్ని పంటి బిగువున భరిస్తున్న రాష్ట్ర ప్రజల్లో చైతన్య ఊపిరూదింది ఆ అడుగుతోనే. యువనేత వేసిన తొలి అడుగు -అప్పటికే విలయ తాండవం చేస్తున్న జగన్ సర్కారు విధ్వంసానికి దారి తీస్తుందని ఎవ్వరూ ఊహించలేదు. రాష్ట్ర ప్రజానీకాన్ని చైతన్యపర్చే వరకూ తన అడుగులు ఆగకూడదని మాత్రమే లోకేష్ సంకల్పించాడు. ఆ సంకల్పం ముందు - జగన్ కుయుక్తులు, కుటిల యత్నాలేవీ ఫలించలేదు. అలా - అపుడు రాష్ట్ర ప్రజలను గెలిచాడు లోకేష్. ఇప్పుడు - రాష్ట్ర ప్రజలను గెలిపించాడు లోకేష్. రాష్ట్ర ప్రజానీకానికి యువనేత లోకేష్ అంటే - మూడక్షరాల గుండెధైర్యం!!*



4

సరైన సమయంలో

## సరైన నాయకుడు

- మోదీ విజన్ వల్లే అభివృద్ధిలో దూసుకెళుతున్న దేశం
- దేశానికి అద్భుత విజయాలందించారు
- ఆర్థికవ్యవస్థను పరుగులు తీయించారు
- ప్రధానిపై చంద్రబాబు ప్రశంసల జల్లు

2

మోదీ ప్రధానిగా ఉన్నంత వరకు..

## ఏ దేశానికీ భారత్ తలొగ్గదు: పవన్

2

చంద్రబాబుకు అధికారం...

## పూలబాట కాదు

- గురజాల మాల్యాద్రి

3

## కొత్త సీఎస్ నీరభ్ కుమార్

8




9

## ఇంకా ఊహాలోకాల్లోనే జగన్‌రెడ్డి

వైసీపీ ఘోరపరాజయానికి జగనే కారణమన్న వర్ల

- వివరాలు 8 లో..

మతాలకు అతీతంగా...

ముస్లింలు ఎక్కువగా ఉన్న స్థానాల్లో

## కూటమి ఘనవిజయం

- వివరాలు 5 లో..